Follow: @ANNTELUGU
07-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 130 | పేజీలు-08 | వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వండి

**దిల్లీలో కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి భేటీ**

- రూ. 38,595 కోట్లతో 7 కారిడార్ల నిర్మాణం
- ఫేజ్3 కింద ఎయిర్‌పోర్ట్ ఫ్యూచర్ సిటీ లైన్
- విస్తరణ కోసమే ఫేజ్1ను టేకోవర్ చేశాం
- డీపీఆర్‌ను ఆమోదించాలని కోరిన రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మహానగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా మెట్రో ఫేజ్ 2, ఫేజ్ 3 ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీ వేదికగా పావులు కదుపుతున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్


మిగతా 2లో

**టాప్ న్యూస్**



### డీఎంకే, తృణమూల్ ఓటమి
- ఐప్యాక్‌తో అఖిలేష్ కటీఫ్

02



### కేటీఆర్ ఒక 420..
- బండి సంజయ్ పిట్టలదొర
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఘాటు విమర్శలు

02



### కాంగ్రెస్ నిర్ణయం గౌరవిస్తాం
- డీఎంకే నేత కనిమొళి


02



టీ20 ర్యాంకింగ్స్ లో
## టీమిండియా నంబర్ వన్
- రెండో ప్లేస్‌లో ఇంగ్లండ్
- టీమిండియా.. 275 పాయింట్లతో టాప్
- 98కి పడిపోయిన టీ20 జట్ల సంఖ్య
- ఐసీసీ తాజా జాబితా విడుదల

**హైదరాబాద్, మహా:** పొట్టి క్రికెట్ ఫార్మాట్‌లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. మైదానంలో పరుగుల వరద పారిస్తూ, అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్న టీమిండియా తాజాగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించిన వార్షిక టీ20 ర్యాంకింగ్స్‌లో ఏకపక్ష ఆధిపత్యం ప్రదర్శించింది. ఏకంగా 275 రేటింగ్ పాయింట్లతో ఏ జట్టు దరిదాపుల్లో లేకుండా నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. ఇటీవల మూడోసారి టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడి చరిత్ర

మిగతా 2లో




## స్టాలిన్‌తో రజనీకాంత్ భేటీ
- ఓటమి వేళ సంఘీభావం
- కష్టకాలంలో అండగా ఉంటానని స్టాలిన్‌కు హామీ

**చెన్నై, మహా:** డీఎంకే ఓటమి నేపథ్యంలో ఆ పార్టీ అధినేత ఎంకే స్టాలిన్‌తో సూపర్‌స్టార్ రజనీకాంత్ బుధవారం చెన్నైలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుపై తీవ్రమైన రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్న తరుణంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల్లో డీఎంకే ఓటమి పాలైన నేపథ్యంలో స్టాలిన్‌కు సంఘీభావం తెలిపేందుకే రజనీకాంత్ ఆయన్ను కలిశారు. ఈ కష్టకాలంలో తాను ఆయనకు అండగా ఉంటానని రజనీ భరోసా ఇచ్చారు. డీఎంకే కూటమిలోని వీసీకే, వామపక్షాల నేతలు కూడా పార్టీ ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'లో స్టాలిన్‌ను కలిసి మద్దతు ప్రకటించారు.

కొత్తగూడెం అటవీ భూముల వివాదంపై సుప్రీంకోర్టు
## సంచలన తీర్పు!
- రెవెన్యూ రికార్డులుంటే హక్కులున్నట్లు కాదు
- కాల్వలనాగరం కేసులో సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరణ
- 600 ఎకరాలు అటవీ భూమిగానే కొనసాగుతుందన్న ధర్మాసనం
- నిజాం కాలం నాటి నోటిఫికేషనే ఫైనల్
- అప్పీలుదారులకు సుప్రీంలో చుక్కెదురు

02

# సౌత్ కింగ్ కాంగ్రెస్సే




## దేశ రాజకీయాల్లో నయా మలుపు
- బీజేపీకి అధికారం.. కాంగ్రెస్ కు ఆధిక్యం
- ఐదు రాష్ట్రాల పోరులో అసలైన విజేత కాంగ్రెస్సే
- 2029లో రాహుల్ కు అడ్వాంటేజ్ గా సమీకరణలు
- తెలంగాణ, కర్నాటక, కేరళలో అధికారం..
- తమిళనాడులోనూ అధికారంలో కీలకం
- ఏపీ మినహా సౌత్ అంతా హస్తవాసే
- ఉత్తరంలో కమలం.. దక్షిణాన హస్తం
- అన్నట్లుగా మారిన దేశ రాజకీయం

**మహా నెట్ వర్క్,**

రాజకీయాల్లో కొన్ని ఓటములు గెలుపు కంటే శక్తివంతమైనవి. మరికొన్ని గెలుపులు భవిష్యత్తులో రాబోయే తుపానుకు హెచ్చరికలు. 2026 ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు దేశరాజకీయ ముఖచిత్రం మార్చాయి. అస్సాం, బెంగాల్ గడ్డపై కమలం వికసించి ఉండవచ్చు.. కానీ, ఆ విజయ గర్జనల వెనుక కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా అల్లిన వ్యూహం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. ప్రాంతీయ పార్టీల ప్రాభవం తగ్గుతున్న వేళ, 'హస్తం' మళ్లీ తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూ 'సౌత్ కింగ్'గా అవతరించింది. ఐదురాష్ట్రాల ఫలితాలు దేశంలో కాంగ్రెస్ ను మరింత పటిష్టం చేశాయి. ఇండి కూటమిలో కాంగ్రెస్ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసింది. బిజెపికి వ్యతిరేకంగా అందరినీ ఐక్యం చేయడానికి ఐదురాష్ట్రాల ఫలితాలు దోహదపడ్డాయి.

### దక్షిణ పథాన.. తిరుగులేని విజయకేతనం

దక్షిణ భారతం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అభేద్యమైన కోట. కర్ణాటక, తెలంగాణల తర్వాత కేరళ మట్టిలోనూ హస్తం హవా సాగింది. దశాబ్ద కాలం నాటి ఎడారిని చీల్చుకుంటూ, వామపక్షాల కంచుకోటను బద్దలు కొట్టి మరీ కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ విజయకేతనం ఎగురవేసింది. దక్షిణాన బీజేపీ వేస్తున్న అడుగులకు కేరళ ఫలితం ఒక 'మైండ్ బ్లాంక్' ట్విస్ట్. ఇది కేవలం ఒక రాష్ట్ర విజయం కాదు.. రాహుల్, ప్రియాంక గాంధీల చరిష్మాకు దక్కిన పట్టాభిషేకం.

### బెంగాల్ లో పునగామన సంకేతం

మమతా బెనర్జీ సామ్రాజ్యం బీటలు వారుతున్న తరుణంలో, కాంగ్రెస్ మళ్లీ తన ఉనికిని చాటుకుంది. 3 శాతం ఓట్ల వాటా చిన్నదే కావొచ్చు, కానీ అది భవిష్యత్తులో బీజేపీకి అసలైన ప్రత్యర్థి కాంగ్రెస్సేనని చెప్పడానికి నాంది. గత ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవని కాంగ్రెస్ ఈసారి 2 సీట్లు, 3 శాతం ఓట్లు సాధించి బిజెపికి ప్రత్యామ్నాయశక్తిగా వస్తున్నామని చెప్పింది. 2021లో బెంగాల్‌లో కాంగ్రెస్ రాష్ట్రంలో పూర్తిగా కనుమరుగు అయ్యింది.

మిగతా 2లో

### తమిళనాడులో కొత్త సమీకరణం: విజయ్‌తో జట్టు

తమిళ గడ్డపై ద్రవిడ రాజకీయాల గుత్తాధిపత్యానికి తెరపడుతోంది. 'దళపతి' విజయ్ రూపంలో వచ్చిన కొత్త ప్రభంజనానికి కాంగ్రెస్ అండగా నిలవడం ఒక మాస్టర్ స్ట్రోక్. డీఎంకే వ్యతిరేకతను ఒడిసిపట్టి, టీవీకే తో కలిసి ప్రభుత్వంలో భాగస్వామి కావడం ద్వారా కాంగ్రెస్ తన 'జూనియర్ పార్ట్నర్' ఇమేజ్‌ను చెరిపేసుకుని, నిర్ణయాత్మక శక్తిగా ఎదిగింది. ఈ అనూహ్య ఎత్తుగడ కాంగ్రెస్‌ను సౌత్ లో మరింత పటిష్టం చేసింది. తమిళనాడులో ఫలితాలు రాగానే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విజయ్ కు ఫోన్ చేసి అభినందించడం కాంగ్రెస్ చురుకుదనానికి, మారిన వ్యూహాలకు అద్దం పడుతోంది. కాంగ్రెస్ అప్ర ఒక్క ఏపీ మినహా అన్ని సౌత్ అంతా కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకుంది. తాజాగా కర్నాటకలో జరిగిన రెండు బైపోల్స్ లోనూ కాంగ్రెస్ విక్టరీ సాధించడం సౌత్ లో కాంగ్రెస్ ఆధిక్యాన్ని చాటుతున్నాయి.

## తమిళ పాలిటిక్స్‌లో ట్విస్ట్
- విజయ్ ప్రమాణస్వీకారానికి బ్రేక్
- టీవీకే కు షాకిస్తున్న ద్రవిడ పార్టీలు
- ఏకమవుతున్న స్టాలిన్, పళనిస్వామి?
- డీఎంకే-అన్నాడీఎంకే మధ్య చర్చలు

వివరాలు 2లో

# సాధారణ మహిళగా అర్ధరాత్రి ఐపీఎస్ సుమతి

**మారువేషంలో మహిళా ఐపీఎస్ సాహసం!.. 40 మంది వెకిలిపోకిరీల ఆటకట్టు**



**హైదరాబాద్, మహా:** నగర పొలిమేరల్లో అర్ధరాత్రి వేళ ఏం జరుగుతోంది? సామాన్యుడికి రక్షణగా ఉండాల్సిన ఖాకీ నిఘా ఎక్కడ? మహిళలు ఒంటరిగా బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానం వెతకడానికి ఆ ఉన్నతాధికారిణి ఏసీ గదులను వీడారు.. తన హోదాను పక్కన పెట్టారు.. సామాన్య మహిళలా మారువేషం ధరించి చీకటి వీధుల్లోకి అడుగుపెట్టారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఐపీఎస్ సుమతి ప్రదర్శించిన ఈ సాహసోపేత కర్తవ్య నిర్వహణ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ఆ గడియారం ముల్లు రాత్రి 12 గంటలు దాటింది. నగరంలోని అత్యంత రద్దీగా ఉండే దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ ప్రాంతం అది. పగలు జనసందోహంతో కిటకిటలాడే ఆ ప్రాంతం అర్ధరాత్రి అయ్యేసరికి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని సమాచారం అందుకున్న సుమతి , స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు సిద్ధమయ్యారు. ఎటువంటి భద్రతా సిబ్బంది లేకుండా,

మిగతా 2లో

నామినేటెడ్
## కొలువుల పండుగ
**బలహీనవర్గాలకు పదవుల పట్టం**
- 18 కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం
- కమ్మ కార్పొరేషన్ కు బండి రమేష్.. మున్నూరుకాపుకు బొమ్మ శ్రీరామ్
- చరణ్ కౌశిక్, రఘునాధ్ యాదవ్ లకు పదవులు
- యాదవులకు పదవుల్లో పెద్దపీట.. ప్రకటించిన టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. సుదీర్ఘ కాలంగా పార్టీ కోసం శ్రమించిన నేతలకు గుర్తింపునిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం 18 కార్పొరేషన్లకు చైర్మన్లను, 11 కార్పొరేషన్లకు వైస్ చైర్మన్లను నియమిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో సామాజిక సమీకరణాలను బేరీజు వేస్తూ ఈ జాబితాను రూపొందించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం జీవో ఆర్టీ నంబర్ 600, 601, 602లను విడుదల చేసింది.

**కీలక నియామకాలు:**

ముఖ్యంగా గ్రామీణ వ్యవస్థపై పట్టున్న సుదిని రామిరెడ్డిని గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ గా నియమించారు.

మిగతా 2లో

## ఆయన ఎగవేతల రేవంత్ రెడ్డి
**ఒక్క ఊళ్లో పూర్తి రుణమాఫీ అయినా రాజీనామాకు సిద్ధం**
- 69 సార్లు ఢిల్లీకెళ్లి 69 పైసలు తేలేదు
- ఇక్కడ నడుస్తున్నది రైతుబంధు కాదు రాహుల్ బంధు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఫైర్



**హైదరాబాద్, మహా:**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, రైతులను నిలువునా మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిని 'ఎనుముల రేవంత్ రెడ్డి' కాదు, 'ఎగవేతల రేవంత్ రెడ్డి' అని ఆయన తీవ్ర పదజాలంతో విమర్శించారు. దమ్ముంటే తనతో ఏ ఊరికైనా రావాలని, కనీసం ఒక్క ఊరిలోనైనా వంద శాతం రైతులందరికీ రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే.. తాను తక్షణమే రాజకీయాల నుంచి రాజీనామా చేస్తానని కేటీఆర్ సంచలన సవాల్ విసిరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అంతా దందాలు, కమీషన్లు, కొట్లాటల మయంగా మారిందని మండిపడ్డారు. బుధవారం వరంగల్ పర్యటనలో భాగంగా కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ముఖ్యమంత్రి మోసపూరిత వైఖరిని ఎండగట్టారు. ఎన్నికలకు ముందు సరిగ్గా ఇదే వరంగల్ గడ్డపైకి వచ్చి, ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి మీద ఒట్టుపెట్టి మరీ డిసెంబర్ 9 నాటికి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలికాడని కేటీఆర్ గుర్తుచేశారు.

మిగతా 2లో

# సౌత్ కింగ్ కాంగ్రెస్సే

(మొదటిపేజీ తరువాయి)

కానీ ఈ దఫా జరిగిన ఎన్నికల్లో బెంగాల్‌లో కాంగ్రెస్ 3% ఓట్ల వాటాను సంపాదించి, రెండు సీట్లను కూడా గెలుచుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ బలహీనపడటం కాంగ్రెస్‌కు వరంగా మారింది. టీఎంసీ పతనం తర్వాత ఏర్పడిన ప్రతిపక్ష శూన్యతను పూరించడానికి లౌకికవాద ఓటర్లు మళ్లీ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో ఇక్కడ పోరు బీజేపీ వర్సెస్ కాంగ్రెస్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత 15 ఏళ్లుగా మమతా బెనర్జీతో సంబంధం ఉన్న ముస్లిం ప్రాబల్య ప్రాంతంలో తన రాజకీయ పట్టును బలపరుచుకునేందుకు కాంగ్రెస్‌కు ఇప్పుడు అవకాశం ఉంది. బెంగాల్‌లో అధికార మార్పిడి భవిష్యత్తులో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీకి దారితీయవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే రాష్ట్రంలో వామపక్షాలు బలహీనపడటం, మమతా బెనర్జీ తన వర్గాన్ని ఐక్యంగా ఉంచుకోలేకపోవడం కారణంగా భవిష్యత్తులో ఈ రెండు జాతీయ పార్టీల మధ్య అసలైన పోరు నెలకునే అవకాశం ఉందని చెబుతున్నారు.

### అస్సాంలో అద్భుతమే

అస్సాంలో బిజెపి హ్యాట్రిక్ విజయం సాధించింది. అదే సందర్భంలో కాంగ్రెస్ కు ఉన్న అడ్డంకులన్నీ తొలగించింది. బద్రుద్దీన్ అజ్మల్ వంటి మతపరమైన రాజకీయాలకు స్వస్తి పలికి, మైనారిటీ ఓటు బ్యాంకును పూర్తిగా తనవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ సఫలమైంది. ఇకపై అస్సాంలో పోరు 'ద్విముఖం' మాత్రమే. గతంలో కాంగ్రెస్ ను దెబ్బకొట్టిన పార్టీలన్నీ ఈ ఎన్నికల్లో దెబ్బతిన్నాయి. ఇపుడు వీటన్నింటికీ కాంగ్రెస్ ను పెద్దన్నగా చూడకపోతే, రాజకీయ మనుగడే ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉంది. అస్సాం ఫలితాలు కాంగ్రెస్‌కు జాక్‌పాట్ కంటే తక్కువ కాదు. నిజానికి ఇక్కడ బీజేపీ హ్యాట్రిక్ అధికారాన్ని దక్కించుకున్నప్పటికీ, కాంగ్రెస్ బద్రుద్దీన్ అజ్మల్ (ఏఐయూడీఎఫ్) రాజకీయాలకు ముగింపు పలికింది. చాలా కాలంగా అస్సాంలోని ముస్లిం ఓటు బ్యాంకు అజ్మల్ - కాంగ్రెస్ మధ్య విభజించబడి, నేరుగా బీజేపీకి ప్రయోజనం చేకూర్చింది. అయితే 2026లో మైనారిటీ ఓటర్లు పూర్తిగా కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. బద్రుద్దీన్ అజ్మల్ ఓటమి అస్సాం భవిష్యత్ రాజకీయాలను ద్విముఖంగా మార్చేసింది. ఇప్పుడు బీజేపీకి ఓట్లను చీల్చే పార్టీలు ఏవీ మిగలకపోవడంతో, భవిష్యత్తులో కాంగ్రెస్‌కు అధికార పీఠం సులువుగా చేజిక్కించుకునే మార్గం కనిపిస్తోంది. కాంగ్రెస్ ఇకపై ముస్లిం ఓట్లను కోల్పోతామనే భయం లేకుండా, బీజేపీ ఓటు బ్యాంకును దెబ్బతీయడంలో మరింత వ్యూహాత్మకంగా పనిచేయనుంది.

### ఫీనిక్స్ పక్షిలా కాంగ్రెస్

ఈ ఎన్నికలు ఒక పచ్చి నిజాన్ని నిర్ధారించాయి. ఇండియా కూటమిలో ప్రాంతీయ నేతలైన స్టాలిన్, మమతా బెనర్జీ, అజ్మల్ వంటి వారి పట్టు సడలింది. ఇప్పుడు 'ఇండియా' కూటమికి కాంగ్రెస్సే ఏకైక దిక్సూచి. "ప్రాంతీయ రాజకీయాల చీకట్లు తొలుగుతున్న వేళ.. జాతీయవాద పోరులో బీజేపీకి అసలైన సవాల్‌గా కాంగ్రెస్ 'ఫీనిక్స్' పక్షిలా పుంజుకుంటోంది. 2026 ఎన్నికల ఫలితాలు బీజేపీకి అధికారాన్ని ఇవ్వడంతో పాటు, కాంగ్రెస్‌కు ఒక ఆశాకిరణాన్ని కూడా అందించాయి. ఇకపై కాంగ్రెస్ కేవలం ఒక పార్టీ మాత్రమే కాదని, బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న ఏకైక శక్తి అని నిరూపించుకుంది. 2026 ఫలితాలు కేవలం అంకెలు కావు.. అవి 2029 మహా సంగ్రామానికి కాంగ్రెస్ వేసిన బలమైన పునాదులు అన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# నామినేటెడ్ కొలువుల పండుగ

(మొదటిపేజీ తరువాయి)

కుల వృత్తుల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ రజక, గీత కార్మిక, మున్నూరుకాపు, యాదవ, వడ్డెర, పద్మశాలి వంటి కార్పొరేషన్లకు పాలకమండళ్లను ప్రకటించారు. అలాగే విద్యా రంగానికి సంబంధించి తెలుగు అకాడమీ బాధ్యతలను ప్రొఫెసర్ వెంకటనారాయణకు అప్పగించారు.

**మహర్దశ దిశగా అడుగులు:**

ఈ నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు అగ్రవర్ణాల్లోని పేద వర్గాలకు (బ్రాహ్మణ పరిషత్ వంటివి) సమాన ప్రాధాన్యత కల్పించడం విశేషం. ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన విధేయులకు ఈ నిర్ణయంతో న్యాయం జరిగిందని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పదవులు పొందిన వారు రెండేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటామని నూతన చైర్మన్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

| | కార్పొరేషన్ / సంస్థ పేరు | చైర్మన్ పేరు |
|---|---|---|
| 1 | తెలంగాణ గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ | సుదిని రామిరెడ్డి |
| 2 | బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ | బస్వరాజు శ్రీనివాస్ |
| 3 | రజక కోఆపరేటివ్ కార్పొరేషన్ | డాక్టర్ దాసరిరాజు అజయ్ కుమార్ |
| 4 | టాడీ ట్యాపర్స్ (గీత కార్మికుల) కార్పొరేషన్ | మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్ |
| 5 | మున్నూరుకాపు కార్పొరేషన్ | బొమ్మ శ్రీరామ్ |
| 6 | యాదవ కోఆపరేటివ్ కార్పొరేషన్ | ఎం. రఘునాథ్ యాదవ్ |
| 7 | వడ్డెర కార్పొరేషన్ | గుంజ రేణుక నారాయణ |
| 8 | హ్యాండ్ లూమ్ (చేనేత) డెవలప్ మెంట్ కార్పొరేషన్ | దుడెం వెంకట రమణ |
| 9 | కమ్మ కార్పొరేషన్ | బండి రమేష్ |
| 10 | పెరిక కార్పొరేషన్ | దొంగరి వెంకటేశ్వర్లు |
| 11 | మేర కార్పొరేషన్ | సంగ వెంకటరాజం |
| 12 | వాల్మీకి బోయ కార్పొరేషన్ | గట్టు తిమ్మప్ప |
| 13 | పద్మశాలి కోఆపరేటివ్ కార్పొరేషన్ | గూడూరు శ్రీనివాస్ |
| 14 | భట్రాజ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ | సీహెచ్. బాలరాజు |
| 15 | వెలమ కార్పొరేషన్ | జువ్వాడి నర్సింగరావు |
| 16 | గొర్రెలు, మేకల అభివృద్ధి ఫెడరేషన్ | కొల్లె సరిత |
| 17 | లైవ్ స్టాక్ డెవలప్ మెంట్ ఏజెన్సీ | చరణ్ కౌశిక్ యాదవ్ |
| 18 | తెలంగాణ తెలుగు అకాడమీ | ప్రొఫెసర్ వెంకటనారాయణ |

# ఆయన ఎగవేతల రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

కానీ తీరా అధికారంలోకి వచ్చాక దేవుళ్లను, రైతులను ఏకకాలంలో మోసం చేశాడని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ చేసిన రుణమాఫీ 'చారానా.. పెట్టిన టోపీ బారానా' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. బ్యాంకుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయిన రైతన్నలు, అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్న దయనీయ పరిస్థితులు రాష్ట్రంలో దాపురించాయని కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### ఢిల్లీకి కప్పం.. రాష్ట్రంలో 'రాహుల్ బంధు'

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపైనా కేటీఆర్ సెటైర్లు వేశారు. అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రేవంత్ రెడ్డి ఏకంగా 69 సార్లు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేశాడని, కానీ రాష్ట్రానికి కనీసం 69 పైసల నిధులు కూడా తీసుకురాలేదని తీవ్రంగా విమర్శించారు. రేవంత్ రెడ్డి అసలు ఒక రెగ్యులర్ ముఖ్యమంత్రి కాదని, ఎప్పటికప్పుడు ఢిల్లీ పెద్దల దయాదాక్షిణ్యాలతో నెట్టుకొస్తున్న 'రెన్యువల్ సీఎం' అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇక్కడి రైతుల కష్టాలు తీర్చడానికి, వారి ఖాతాల్లో డబ్బులు వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి పైసలు లేవు కానీ.. ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మాత్రం మూటలకు మూటలు పంపిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతుబంధు' అమలు చేయడం లేదని, ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టే 'రాహుల్ బంధు' నడుస్తోందని కేటీఆర్ దుయ్యబట్టారు.

### రైతు ప్రగతికి కేసీఆరే బ్రాండ్ అంబాసిడర్

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులు రారాజుల్లా బతికారని కేటీఆర్ గుర్తుచేశారు. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో రైతును రాజుగా చూసుకున్న ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఆగమైపోయిన తెలంగాణ వ్యవసాయ రంగాన్ని అద్భుతమైన పథకాలతో కేసీఆర్ తిరిగి గాడిలో పెట్టారని, రైతు ప్రగతికి ఒక విప్లవాన్ని సృష్టించారని కొనియాడారు. కేవలం పదేళ్ల కాలంలోనే తెలంగాణ రైతాంగం కోసం రూ. 5 లక్షల కోట్లు వెచ్చించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ దార్శనికత వల్లే వరంగల్ సహా రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం పెరిగిందని, తద్వారా భూముల రేట్లు కోట్లకు పడగలెత్తాయని వివరించారు. కానీ కాంగ్రెస్ రాతి యుగం పాలనతో మళ్లీ భూముల ధరలు అమాంతం పాతాళానికి పడిపోయాయని ఆయన విమర్శించారు.

### మళ్లీ పాత రోజులు.. కొనుగోలు కేంద్రాల్లో కన్నీళ్లు

కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రంలో మళ్లీ పాత కష్టాలు మొదలయ్యాయని కేటీఆర్ వాపోయారు. పండించిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు రోజుల తరబడి వానల్లో, ఎండల్లో కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్సెట్టిపేట కొనుగోలు కేంద్రంలో గోడ కూలి నలుగురు అమాయక రైతులు ప్రాణాలు కోల్పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి, నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యమని ఆయన మండిపడ్డారు. ప్రజల గురించి, రైతుల ఆకలి చావుల గురించి పట్టించుకునే నాథుడే కాంగ్రెస్ ప్రభుత్వంలో కరువయ్యాడని విమర్శించారు. అన్నదాతలను మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

# తమిళ పాలిటిక్స్ లో ట్విస్ట్

- విజయ్ ప్రమాణస్వీకారానికి బ్రేక్
- టీవీకే కు షాకిస్తున్న ద్రవిడపార్టీలు
- ఏకమవుతున్న స్టాలిన్, పళనిస్వామి?
- డీఎంకేఅన్నాడీఎంకే మధ్య చర్చలు

**చెన్నై-మహా:** విజయ్ సీఎం కాకుండా అడ్డుకునేందుకు యాభై ఏండ్ల వైరాన్ని డీఎంకే అన్నాడీఎంకే పార్టీలు పక్కనపెడుతున్నాయి. తమిళ పాలిటిక్స్ లో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు చోటుచేసుకుంటున్నాయి. 107 మంది టీవీకే ఎమ్మెల్యేలు, 5 గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి తమకు 112మంది మద్దతు ఉందని, అతిపెద్ద పార్టీగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించాలని విజయ్ కోరగా, గవర్నర్ అనుమతించలేదు. దీంతో ప్రమాణస్వీకారానికి రంగం సిద్ధం చేసుకున్న విజయ్ కు షాక్ తగిలింది. మరోవైపు విజయ్ సీఎం అయితే తమకు మనుగడ ఉండదని ద్రవిడపార్టీలు ఏకమవుతున్నాయి. డీఎంకే 59, అన్నాడీఎంకే 47కలిస్తే 106స్థానాలుండగా, మిత్రులతో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు చర్చలు జరుపుతుండడం విస్మయపరుస్తోంది. తమిళ ప్రజల్లో ద్రవిడపార్టీల తీరుపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. శుక్రవారం విజయ్ ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చేసుకోగా, గవర్నర్ ట్విస్ట్ ఇవ్వడంతో దేశవ్యాప్తంగా ఉన్న విజయ్ అభిమానులతో పాటు తమిళనాడు ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మెజారిటీకి అడుగుదూరంలో నిలిచిన విజయ్ కు మరో ఆరుగురు మద్దతునిస్తారా? ద్రవిడపార్టీలు షాకిస్తారా? అన్నది చూడాలి.

# సాధారణ మహిళగా అర్ధరాత్రి ఐపీఎస్ సుమతి



(మొదటిపేజీ తరువాయి)

గన్‌మెన్ల పహారా లేకుండా, కేవలం ఒక సాదాసీదా సామాన్య మహిళలా ఆమె బస్టాండ్‌లో నిలబడ్డారు. అక్కడ ఆమెకు ఎదురైన అనుభవాలు నాగరిక సమాజం తలదించుకునేలా ఉన్నాయి.ఆమె ఎవరో తెలియని కొందరు మృగాళ్లు, మత్తులో జోగుతున్న పోకిరీలు ఆమెను చుట్టుముట్టారు. రక్షణ కల్పించాల్సిన చోట రాక్షసంగా ప్రవర్తించారు. 'నీ రేటు ఎంత?' అంటూ సభ్య సమాజం అసహ్యించుకునేలా వెకిలి ప్రశ్నలు వేశారు. ఆ అధికారిణి గుండెల్లో ఆవేదన రగిలినా, వ్యవస్థలోని లోపాలను పూర్తిగా పసిగట్టే వరకు ఆమె మౌనంగానే భరించారు. దాదాపు మూడు గంటల పాటు ఆమె అక్కడే గడిపారు. ఈ సుదీర్ఘ సమయంలో ఒక్కటంటే ఒక్క పెట్రోలింగ్ వాహనం గానీ, నీడలా ఉండాల్సిన పోలీసు కానిస్టేబుల్ గానీ అక్కడ కనిపించకపోవడం గమనార్హం. భద్రతా వ్యవస్థలో ఉన్న డొల్లతనాన్ని ఈ ఘటన కళ్లకు కట్టినట్లు చూపింది. మరీ ముఖ్యంగా, అక్కడ గుమిగూడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులు, ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువత ఉండటం అత్యంత విచారకరం. వారు మద్యం, గంజాయి మత్తులో తూలుతూ మృగాల కంటే హీనంగా ప్రవర్తిస్తున్న తీరును చూసి ఆ అధికారిణి నివ్వెరపోయారు. తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో ఒక బీట్ కానిస్టేబుల్ అక్కడికి చేరుకున్న తర్వాతే అసలు కథ మొదలైంది. సాధారణ మహిళగా ఉన్న వ్యక్తి తన కమిషనర్ అని గుర్తించిన ఆ కానిస్టేబుల్ ఒక్కసారిగా నిశ్చేష్టుడయ్యాడు. వెంటనే సమాచారం అందుకున్న ఎస్సై అక్కడికి చేరుకుని సెల్యూట్ చేయడంతో, అంతసేపు ఆమెను వేధించిన పోకిరీల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. వెంటనే స్పందించిన పోలీసులు దాదాపు 40 మందిని అదుపులోకి తీసుకున్నారు. మత్తు దిగిన తర్వాత వారి ముఖాల్లో కనిపించిన భయం, వారు చేసిన నేరానికి ప్రాయశ్చిత్తం కాదని భావించిన కమిషనర్ సుమతి వారికి గట్టి కౌన్సిలింగ్ ఇచ్చారు. చదువుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన వయసులో మత్తుకు బానిసలై, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే జీవితాలు ఎలా నాశనం అవుతాయో గట్టిగా హెచ్చరించారు. ఈ సంఘటన కేవలం నేరస్థులను పట్టుకోవడమే కాకుండా, పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనం ఎంత అవసరమో చాటి చెప్పింది. ఏసీ గదుల్లో కూర్చుని ఇచ్చే ఆదేశాల కంటే, క్షేత్రస్థాయిలో సమస్యలను ఎదుర్కొన్నప్పుడే పరిష్కారం లభిస్తుందని నిరూపించిన సుమతి గారి సాహసాన్ని యావత్ సమాజం కొనియాడుతోంది.

# టీ20 ర్యాంకింగ్స్ లో టీమిండియా నంబర్ వన్

(మొదటిపేజీ తరువాయి)

సృష్టించిన భారత జట్టు, అదే జోరును ర్యాంకింగ్స్‌లోనూ కొనసాగించి దుమ్మురేపింది. ఇంగ్లండ్ జట్టు 262 పాయింట్లతో రెండో స్థానంలో నిలవగా, ఆస్ట్రేలియా 258 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. టాప్7 స్థానాల్లో ఎటువంటి మార్పులు చోటు చేసుకోలేదు. న్యూజిలాండ్ (247), సౌతాఫ్రికా (244), పాకిస్థాన్ (240), వెస్టిండీస్ (233) ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. మూడుసార్లు టీ20 కప్పును గెలిచిన జట్టుగా రికార్డులకెక్కిన టీమిండియా భవిష్యత్తు సిరీస్‌ల్లోనూ ఇదే జోరును కొనసాగించేలా కనిపిస్తోంది. ఆసియా దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్ జట్ల ర్యాంకుల్లో స్వల్ప మార్పులు జరిగాయి. ఆరు పాయింట్లు కోల్పోయిన శ్రీలంక జట్టు (221 పాయింట్లు) ఒక స్థానం దిగజారి తొమ్మిదో స్థానానికి పడిపోగా, బంగ్లాదేశ్ (225 పాయింట్లు) ఒక స్థానం ఎగబాకి ఎనిమిదో ర్యాంకును కైవసం చేసుకుంది. అఫ్గానిస్థాన్ (220) జట్టు శ్రీలంకకు అత్యంత చేరువలో ఉంటూ పదో స్థానంలో కొనసాగుతోంది. ఇక పసికూనలుగా భావించే జింబాబ్వే, ఐర్లాండ్ జట్లు వరుసగా 11, 12 స్థానాల్లో నిలిచాయి. ఈ తాజా ర్యాంకింగ్స్ కోసం ఐసీసీ కొత్త పద్ధతిని అనుసరించింది. 2025 మే నెల నుంచి జరిగిన మ్యాచ్‌లకు 100 శాతం వెయిటేజీని ఇవ్వగా, అంతకు ముందు రెండేళ్ల పాటు జరిగిన మ్యాచ్‌లకు 50 శాతం వెయిటేజీని కేటాయించి పాయింట్లను లెక్కగట్టింది. ఈ నిబంధనల ప్రకారం జట్ల ర్యాంకుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇక గత మూడేళ్ల కాలంలో కనీసం ఎనిమిది టీ20 మ్యాచ్‌లు ఆడని జట్లపై ఐసీసీ కఠిన చర్యలు తీసుకుంది. ఈ నిబంధనను చేరుకోలేకపోయిన ఫిజీ, గాంబియా, గ్రీస్, ఇజ్రాయెల్ జట్లను టీ20 ర్యాంకింగ్స్ జాబితా నుంచి తొలగించింది. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఉన్న మొత్తం జట్ల సంఖ్య 102 నుంచి 98కి పడిపోయినట్లు ఐసీసీ వర్గాలు అధికారికంగా వెల్లడించాయి.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఖట్టర్‌తో సమావేశమైన సీఎం.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మెట్రో విస్తరణ ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర డీపీఆర్‌ను ఆమోదించాలని, జాయింట్ వెంచర్ విధానంలో కేంద్రం ఈ ప్రాజెక్టులో భాగస్వామి కావాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి ప్రతిపాదించిన మెట్రో కారిడార్‌ను ఫేజ్3 కింద చేపట్టాలని, ఇందుకు కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. విశ్వనగరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రజారవాణా వ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన ఆవశ్యకతను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఇప్పటికే కేంద్రానికి సమర్పించినట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. నగరంలో ఏడు కొత్త కారిడార్ల ద్వారా ఏకంగా 122.9 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో ఈ డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. ఇంతటి భారీ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో (జాయింట్ వెంచర్) చేపట్టేందుకు వీలుగా సత్వరమే ఆమోదముద్ర వేయాలని రేవంత్ రెడ్డి కోరారు.భవిష్యత్ విస్తరణ కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాజావుగా సాగే ఉద్దేశంతోనే మెట్రో ఫేజ్ 1ను ఎల్ అండ్ టీ, హెచ్ఎంఆర్ఎల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ పర్యవేక్షణలోకి వచ్చినందున, ఇకపై రెండో, మూడో దశల విస్తరణ పనులు మరింత సులువుగా, వేగంగా జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# డీఎంకే, తృణమూల్ ఓటమి

## ఐ-ప్యాక్‌తో అఖిలేష్ కటీఫ్

**లక్నో, మహా:** తమిళనాడులో డీఎంకే కూటమి, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం చవిచూశాయి. ఈ రెండు పార్టీలకు ఐప్యాక్ పనిచేసింది. అయితే ఈ ఓటమి తర్వాత రెండు రోజులకే ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ కీలక నిర్ణయం ప్రకటించారు. ఐప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇందుకు నిధుల కొరత కారణమని ఆయన తెలిపారు. వచ్చే సంవత్సరం ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐప్యాక్‌తో గత సంవత్సరం ఒప్పందం కుదుర్చుకున్నామని అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఐప్యాక్ టీమ్ తమతో కొన్ని నెలలు పని చేసిందని, కానీ నిధుల కొరత కారణంగా దానిని కొనసాగించలేకపోతున్నామని వెల్లడించారు. ఐప్యాక్ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేశారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. "మా వద్ద నిధులు లేవు. మీరు (మీడియా) మాకు నిధులు ఇస్తే మరో కంపెనీని ఎన్నికల కోసం నియమించుకుంటాం" అని అఖిలేష్ సరదాగా అన్నారు. కానీ, ఐప్యాక్ పని చేసిన రెండు పార్టీలు ఓడిపోయిన అనంతరం అఖిలేష్ యాదవ్ నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తీరును అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. దీనిని సుప్రీంకోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగును ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. బెంగాల్‌లో చోటు చేసుకున్న పరిణామాలు వచ్చే సంవత్సరం ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌లో పునరావృతమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ నిర్ణయం గౌరవిస్తాం

## డీఎంకే నేత కనిమొళి

**చెన్నై, మహా:** ఎన్నికల ఫలితాల తర్వాత డీఎంకే కూటమి నుంచి కాంగ్రెస్ బయటకు వచ్చి, విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి మద్దతు ప్రకటించడం పై డీఎంకే కీలకనేత కనిమొళి స్పందించారు. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకైనా తమకు నచ్చిన నిర్ణయం తీసుకునే హక్కు ఉంటుందని కనిమొళి పేర్కొన్నారు. డీఎంకేకాంగ్రెస్ కలిసి చాలా ఎన్నికల్లో పనిచేశాయని, ఈసారి ఓటమి చవిచూశామని ఆమె తెలిపారు. కాంగ్రెస్ తన సొంత నిర్ణయం తీసుకుందని, దానిని తాము గౌరవిస్తామని చెప్పారు. టీవీకే తనను తాను సెక్యులర్ పార్టీగా చెప్పుకోవడంపై స్పందిస్తూ...తమిళనాడులో మరో సెక్యులర్ పార్టీ రావడాన్ని తాము ఆహ్వానిస్తామన్నారు. దీనివల్ల డీఎంకేకు ఎలాంటి భయం లేదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో డీఎంకే కేవలం 59 స్థానాలకు పరిమితం కావడం, స్వయంగా స్టాలిన్ కొలత్తూరులో ఓడిపోవడంపై పార్టీ కచ్చితంగా విశ్లేషణ చేసుకుంటుందని చెప్పారు. ప్రజలు మార్పును కోరుకున్నారని ఆమె అంగీకరించారు. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్‌కు ఆమె అభినందనలు తెలిపారు. ప్రజలు ఆశించిన రీతిలో టీవీకే పాలన అందిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# కొత్తగూడెం అటవీ భూముల వివాదంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు!

- రెవెన్యూ రికార్డులుంటే హక్కులున్నట్లు కాదు
- కాల్వలనాగరం కేసులో సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరణ
- 600 ఎకరాలు అటవీ భూమిగానే కొనసాగుతుందన్న ధర్మాసనం
- నిజాం కాలం నాటి నోటిఫికేషనే ఫైనల్
- అప్పీలుదారులకు సుప్రీంలో చుక్కెదురు



**హైదరాబాద్, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న ఓ భారీ భూవివాదానికి దేశ సర్వోన్నత న్యాయస్థానం శాశ్వత ముగింపు పలికింది. కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతమైన పినపాక మండలం కాల్వలనాగరంలో ఉన్న సుమారు 600 ఎకరాల భూమి తమదేనంటూ కొందరు వ్యక్తులు సుదీర్ఘకాలంగా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ భూములను అటవీ శాఖ రక్షిత ప్రాంతంగా పరిగణిస్తుండగా, పిటిషనర్లు మాత్రం తమకు రెవెన్యూ రికార్డుల్లో పేర్లు ఉన్నాయని వాదిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో కింది కోర్టుల నుంచి హైకోర్టు వరకు పలుమార్లు విచారణలు జరిగాయి. గతంలో రాష్ట్ర హైకోర్టు సైతం ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఈ భూములను అటవీ భూములుగానే నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ అప్పీలుదారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం జస్టిస్ ఎస్.వీ.ఎన్. భట్టి ధర్మాసనం ఈ అప్పీలును తోసిపుచ్చుతూ తుది తీర్పు వెలువరించింది.

### రెవెన్యూ రికార్డులు హక్కుల పత్రాలు కావు

విచారణ సందర్భంగా ధర్మాసనం రెవెన్యూ రికార్డుల ప్రామాణికతపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఆస్తిపై యాజమాన్యం లేదా టైటిల్ ను నిర్ధారించడానికి రెవెన్యూ రికార్డులు ఏమాత్రం ప్రాతిపదిక కాజాలవని కోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వానికి పన్నులు లేదా శిస్తు వసూలు చేసే ఉద్దేశ్యంతో మాత్రమే రెవెన్యూ యంత్రాంగం ఆ రికార్డులను నిర్వహిస్తుందని, అవి వ్యక్తులకు భూమిపై చట్టబద్ధమైన యాజమాన్య హక్కులను కల్పించవని కుండబద్దలు కొట్టింది. తమ క్లెయిమ్ కు సంబంధించి అప్పీలుదారులు ఎలాంటి అసలైన, చట్టబద్ధమైన టైటిల్ డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించడంలో విఫలమయ్యారని ధర్మాసనం తప్పుబట్టింది. పత్రాలు లేకుండా కేవలం రెవెన్యూ రికార్డుల ఆధారంగా హక్కులు కోరడం సరికాదని వ్యాఖ్యానించింది.

### నిజాం ఫారెస్ట్ నోటిఫికేషన్ కు సమర్థన

ఈ భూములకు సంబంధించి 1950లో అప్పటి నిజాం ప్రభుత్వం జారీ చేసిన ఫారెస్ట్ నోటిఫికేషన్ ను అప్పీలుదారులు సవాలు చేశారు. అయితే వారి వాదనలను కోర్టు తోసిపుచ్చింది. నిజాం కాలం నాటి నోటిఫికేషన్ ఆధారంగా ఆ 600 ఎకరాలు రక్షిత అటవీ ప్రాంతమేనని కోర్టు ధృవీకరించింది. ఈ వ్యవహారంలో గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఎలాంటి న్యాయపరమైన లోపాలు లేవని, ఆ తీర్పును యథాతథంగా సమర్థిస్తున్నామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సర్వోన్నత న్యాయస్థానం తాజా తీర్పుతో ఆ 600 ఎకరాలు ఇకపై అటవీ భూములుగానే కొనసాగుతాయని స్పష్టమైంది. అటవీ సంపద ఆక్రమణలకు చెక్ పెట్టే దిశగా సుప్రీంకోర్టు తీర్పు ఒక మైలురాయిగా నిలుస్తుందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# కేటీఆర్ ఒక 420.. బండిసంజయ్ పిట్టలదొర

## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఘాటు విమర్శలు





**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. బుధవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేటీఆర్ రాజకీయ చరిత్రను, గత ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రస్థాయిలో ఎండగట్టారు. "కేటీఆర్ ఒక 420. ఆయనది దొంగల బ్యాచ్," అంటూ మహేష్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాస్‌పోర్ట్ కుంభకోణం నుంచి భూముల కుంభకోణం వరకు కేటీఆర్ కుటుంబం హస్తం ఉందని ఆయన ఆరోపించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వంటి నాయకులను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఉద్యమ సమయంలో దొంగచాటుగా వచ్చి చేరి, కేకే మహేందర్ రెడ్డి లాంటి నాయకుల గొంతు కోసిన చరిత్ర కేటీఆర్‌దని మండిపడ్డారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను మద్యానికి బానిసలుగా మార్చి రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసిందని మహేష్ గౌడ్ విమర్శించారు. "ఏం చేశారని ఒకే కుటుంబంలో ఉన్న వారందరికీ పదవులు ఇచ్చుకున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. దళితుడిని ముఖ్యమంత్రి చేయకపోతే తల నరుక్కుంటానన్న కేసీఆర్ మాటలను గుర్తు చేస్తూ.. "కేసీఆర్‌కు ఇప్పుడు తల ఉందా లేదా?" అని ఎద్దేవా చేశారు.

### డ్రగ్స్ ప్రభావంపై అనుమానం

కేటీఆర్ చేస్తున్న విమర్శల వెనుక మాదకద్రవ్యాల ప్రభావం ఉందేమోనన్న అనుమానం కలుగుతోందని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, కేటీఆర్ పిచ్చి మాటలు కట్టిపెట్టాలని హెచ్చరించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను 'పిట్టల దొర' అంటూ విమర్శలు గుప్పించారు. "సీబీఐకి కేసు అప్పగిస్తే పొడి చేస్తామన్నారు.. మరి ఆరు నెలలుగా ఏం చేస్తున్నారు?" అని ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో సీపీఎంతో దోస్తీ కొనసాగుతుందని, కేరళ వంటి రాష్ట్రాల్లో పరిస్థితులకు అనుగుణంగా పోరాటం ఉంటుందని స్పష్టం చేశారు. తమిళనాడులో డీఎంకేతో ఎన్నికలకు వెళ్లినప్పటికీ, అక్కడి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలోనే టీవీకే కి మద్దతు ఇచ్చామని ఆయన వివరించారు.

# ఆర్టీసీకి అభయం హస్తం





-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ

తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులు పోషించిన పాత్ర మరువలేనిది. రాష్ట్ర సాధన కోసం జరిగిన ప్రతి ఉద్యమంలో వారు ముందుండి పోరాడారు. బస్సులు నిలిపివేసి, విధులను పక్కనపెట్టి, కుటుంబ భద్రతను సైతం పణంగా పెట్టి తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారికి గౌరవం, ఉద్యోగ భద్రత, సంక్షేమం లభిస్తాయని అందరూ ఆశించారు. కానీ ఆ ఆశలను బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేకపోయింది. వేతన సవరణలు, ఆర్టీసీ బలోపేతం, ప్రభుత్వంలో విలీనం వంటి కీలక అంశాలు వాగ్దానాలుగానే మిగిలిపోయాయి. ముఖ్యంగా 2019లో జరిగిన 52 రోజుల ఆర్టీసీ సమ్మె కార్మికుల ఆవేదనను రాష్ట్రానికి తెలియజేసింది. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యోగులే తమ హక్కుల కోసం మళ్లీ రోడ్డెక్కాల్సి రావడం బాధాకరం. ఇది గత పాలనలో కార్మికుల పట్ల జరిగిన నిర్లక్ష్యానికి నిదర్శనం.

ఆ సమ్మె సాధారణ ఉద్యోగుల నిరసన కాదు. అది ఆత్మ గౌరవం కోసం, జీవన భద్రత కోసం, హక్కుల సాధన కోసం జరిగిన పోరాటం. కానీ అప్పటి ప్రభుత్వం దానిని చట్టవిరుద్ధమని ప్రకటించింది. చర్చలకు నిరాకరించింది. సుమారు 48 వేల మంది కార్మికులను "సెల్ఫ్ డిస్మిస్" పేరుతో విధుల నుంచి తొలగించినున్నట్లు . ఈ నిర్ణయం వేలాది కుటుంబాలను భయాందోళనలకు గురిచేసింది. ఆ సమయంలో 36మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వెలువడ్డాయి. పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారు. కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. కానీ కేసీఆర్ ప్రభుత్వం చలించలేదు. ఒక్క సానుభూతి మాట కూడా వినిపించలేదు. సమస్య పరిష్కారం కోసం ముందుకు రావడం బదులు, సమ్మెను అణచివేయడమే లక్ష్యంగా వ్యవహరించింది. తెలంగాణ ఉద్యమంలో భుజం కలిపిన కార్మికులను శత్రువుల్లా చూసింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాణాలకు తెగించి పోరాడిన కార్మికులు సొంత రాష్ట్రంలో కూడా బలిదానాలు చేయాల్సి రావడం శోచనీయం. అక్కడితో ఆగకుండా ఉద్యోగ సంఘాలను రద్దు చేయడం, రెండు వేతన సవరణలను పెండింగ్లో పెట్టడం, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ఇవ్వకుండా వాయిదా వేయడం, ఆర్టీసీ విలీనం చేస్తామని హామీ ఇచ్చి మధ్యలోనే ఆ ప్రక్రియను వదిలేయడం వంటి నిర్ణయాలు కార్మికుల్లో తీవ్ర నిరాశ కలిగించాయి. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యోగులకు ఇది ఖచ్చితంగా మోసమే.


కార్మిక హక్కులను అణగదొక్కిన బీఆర్ ఎస్ ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తోంది. ఆ పార్టీ నేతలు నేడు ఆర్టీసీ సమ్మెపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం వ్యంగ్యంగా కనిపిస్తోంది. అందుకే,కార్మిక సంఘాలే బహిరంగంగా బీఆర్ఎస్కు ప్రశ్నించే హక్కు లేదని చెబుతున్నాయి. "నాడు మా ఆత్మహత్యలపై సంతాపం తెలియజేయని వారు, నేడు మా కోసం మాట్లాడటం కపట రాజకీయమే" అని కార్మికులు స్పష్టంగా చెప్పారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులపై వ్యవహరించిన తీరు పూర్తిగా భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం సమస్యలను అణచివేయడం కాదు, చర్చల ద్వారా పరిష్కరించడం అనే ప్రజాస్వామ్య విధానాన్ని అవలంబిస్తోంది. ఇదే నిజమైన పరిపాలన. ఇదే ప్రజా పాలన ప్రభుత్వం. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్మికుల సమస్యలను సానుభూతితో విన్నారు. మూడు రోజుల్లోనే సమ్మె ముగిసేలా చొరవ తీసుకున్నారు. యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిపి సామరస్య వాతావరణం సృష్టించారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలు ఒక్కరోజులో పరిష్కారం కావని, వాటిని పరస్పర విశ్వాసంతో పలు దఫాల చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించవచ్చని మంత్రి చెప్పడం బాధ్యతాయుత రాజకీయానికి నిదర్శనం. ఇది గత ప్రభుత్వ అహంకార ధోరణికి పూర్తి విరుద్ధం. కార్మికులను బెదిరించడం కాదు, వారిని వినడం కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణి. ఉద్యోగుల సమస్యను రాజకీయ అవకాశంగా కాకుండా పరిపాలనా బాధ్యతగా చూడటం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రత్యేకతగా నిలుస్తోంది.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు కార్మికులతో సమావేశమై సమస్యను సామరస్యంగా ముగించారు. 11 శాతం ఫిట్మెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఒప్పుకుంది. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనంపై కమిటీకి ఉభయ పక్షాలు అంగీకరించాయి. కేసీఆర్ ప్రభుత్వం కార్మికులపై కక్షగట్టి గుర్తింపు సంఘాలను రద్దు చేస్తే వాటి పునరుద్ధరణకు, సంఘాల ఎన్నికలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించింది. కార్మికుల మొత్తం 32 డిమాండ్లలో దాదాపు అన్నింటినీ ప్రభుత్వం అంగీకరించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 2013 వేతన సవరణ బాండ్స్ రూ.280 కోట్ల బకాయిలను తీర్చడంతో పాటు 2017కి సంబంధించి పీఆర్సీ, పెండింగ్ డీఏలు చెల్లించడంతో కార్మికులకు ప్రభుత్వంపై భరోసా కలిగింది.

కార్మికుల పక్షపాతి అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోకుండా వారితో చర్చలు జరిపింది. సమ్మె ముగించిన తర్వాత కార్మికులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన సందర్భంలో ఆయన ఆర్టీసీ ఉద్యోగులకు భరోసా కల్పించారు. కార్మికుల సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని చెప్పిన సీఎం గుర్తింపు సంఘాల ఎన్నికలు, విలీనంపై తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్మికుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించడమే కాకుండా, వారిపై కేసులు కూడా ఎత్తివేస్తామని ముఖ్యమంత్రి చెప్పడంతో నాటి బీఆర్ ఎస్ ప్రభుత్వానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్యనున్న భేదం ఇదేనని కార్మికులు గొప్పగా చెప్పుకుంటున్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూడా సమ్మెకు మద్దతుగా రావడం, మంత్రి, సంస్థ ఎండీ నేరుగా ఆస్పత్రికి వెళ్లి చనిపోయిన కార్మికుడి కుటుంబ సభ్యులను పరామర్శించడం, "మేమున్నాం" అనే భరోసా కల్పించడం ఇవన్నీ కార్మికుల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. ఇది అధికారంలో ఉన్న పార్టీ ప్రజలతో ఎలా ఉండాలో చూపించే ప్రత్యక్ష ఉదాహరణ. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్ట్రిక్ బస్సుల విధానం కూడా కార్మిక సంఘాల్లో ఆందోళన కలిగిస్తోంది. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది, శ్రామిక్ వర్గాల ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడుతుందని వారు హెచ్చరిస్తున్నారు. ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం గంభీరంగా పరిగణించి ఉద్యోగ రక్షణకు స్పష్టమైన హామీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆర్టీసీ అనేది కేవలం ఒక రవాణా సంస్థ కాదు. అది లక్షలాది కుటుంబాల జీవనాధారం. తెలంగాణ గ్రామీణ, పట్టణ జీవనాన్ని కలిపే నాడి. విద్యార్థి నుంచి వృద్ధుడి వరకు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైన ప్రజా రవాణా వ్యవస్థ. అలాంటి సంస్థను బలోపేతం చేయడం అంటే ప్రజా ప్రయోజనాన్ని కాపాడటం. కార్మికుల సంక్షేమం అంటే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేయడం. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ ఉద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి బాధపెట్టింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారిని భాగస్వాములుగా చూస్తోంది. అదే అసలు తేడా. అదే ప్రజాస్వామ్య పరిపాలన. ఆర్టీసీ కార్మికులు కోరేది గౌరవం, ఉద్యోగ భద్రత, న్యాయం మాత్రమే. తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచిన ఈ వర్గాన్ని నిర్లక్ష్యం చేసిన పాలనకు ప్రజలు ఇప్పటికే తగిన తీర్పు ఇచ్చారు. కార్మికుల కన్నీటి మీద అధికారాన్ని నిలబెట్టలేమనే వాస్తవాన్ని బీఆర్ఎస్ గుర్తుంచుకోవాలి. సమస్యలను అణచివేయడం కాదు.. చర్చల ద్వారా పరిష్కరించడం ప్రజాస్వామ్య పాలన లక్షణం. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అదే మార్గంలో ముందుకు సాగుతోంది. ఆర్టీసీ కార్మికుల గౌరవాన్ని కాపాడటం అంటే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం. ఇది కేవలం ఉద్యోగుల విజయం మాత్రమే కాదు.. ప్రజాస్వామ్య విలువలు గెలిచిన సందర్భం.



## ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా షూటింగులు జరపాలి !

ప్రస్తుతం తెలుగు సినిమా షూటింగు లను ఎక్కడో దూర ప్రాంతాలు గాకుండా ఆంధ్రప్రదేశ్ లోనే జరపాలి. ఎందుకంటే ఏపీ లో ఎన్నో లోకేషన్ లు వున్నాయి. పైగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ముఖ్యంగా కోస్తా, కృష్ణానది తీరం గోదావరి నది తీరం, తిరుపతి పుణ్య క్షేత్రం,రాయలసీమ లో కొన్ని ప్రాంతాలు మదనపల్లి హార్స్ లీ హిల్స్, పులివెందుల, కదిరి రహదారి మార్గం, తిమ్మమ్మ మర్రి మాను, లేపాక్షి ప్రాంతం పరిసరాలు, అనంతపురం జిల్లా లో గుత్తి దుర్గం,పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, గుంతకల్లు కసాపురం నెట్టి కంటి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం దక్షిణ మధ్య రైల్వే రైల్వే జంక్షన్ కేంద్రం విజయవాడ పెనుకొండ కోట, ముదిగుబ్బ ప్రాంతం, దొరిగల్లు , రాయదుర్గం, కల్యాణ దుర్గం ప్రాంతాలు సినిమా షూటింగులకు అనుకూలం. పుట్టపర్తి బుక్క పట్నంచెరువు పెనుకొండ కుంభకర్ణ ప్రదేశం మరియూ అంతర్జాతీయ స్థాయి లో కియా కార్లు తయారు చేయు ఫ్యాక్టరీ ఇక్కడే వుంది.అదేవిదంగా రాజమండ్రి పట్టణం, మచిలీపట్నం సముద్రం ప్రాంతం, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, రాజోలు తూ గో జిల్లా ప్రాంతం, ధవళేశ్వరం, కాటన్ దొర గోదావరి బ్రిడ్జి కాటన్ దొర విగ్రహం ప్రాంతం,కడియం పూల తోట ప్రాంతం, అన్నవరం, విశాఖపట్నం బీచ్ ప్రాంతం, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, కాకినాడ తుని ప్రాంతం, సామర్లకోట, శ్రీ కాకుళం, విజయనగరం ప్రాంతం, ఇక చిత్తూరు జిల్లా లోని కాణిపాకం ఆలయం, తిరుమల శ్రీ వారి ఆలయం తిరుపతి పరిసర ప్రాంతాలు ఇలా ఎన్నో పుణ్య క్షేత్రాలు గల మన ఆంధ్రప్రదేశ్ లో తెలుగు సినిమా షూటింగులకు అనువైన ప్రదేశాలు ఎన్నో వున్నాయి. వాటి లోకేషన్ లను తెలుగు సినిమా పరిశ్రమ వారు గమనించి తమ తమ సినిమాలకు ఉపయోగించుకోవచ్చును. రాష్ట్ర దేవాదాయ శాఖ అనుమతి తో ఆలయం పరిసరాల లో సినిమా షూటింగు లను జరుపుకోవాలని తెలుగు సినిమా అభిమానులు కోరుతున్నారు.ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాలు అన్నీ తెలుగు సినిమా షూటింగులకు అనుకూలం. ఈ సినిమా షూటింగుల వలన మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆదాయం లభించగలదు. నూతన రాజధాని అమరావతి కేంద్రం కూడా తెలుగు సినిమా షూటింగు లకు మరింత అనుకూలం కాగలదు. తెలుగింట తెలుగు కళా వైభవం ఉట్టి పడేలా లో తెలుగు సినిమా షూటింగులు కూడా జరపడం ఒక వరమే దీనివలన మన ప్రాచీన సంస్కృతి అందరికీ తెలుస్తుంది.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర
63005 46700

# కరీంనగర్ దోపిడి ఘటన నేర్పిన గుణపాఠం

**ఆర్టీసీ అనేది కేవలం ఒక రవాణా సంస్థ కాదు. అది లక్షలాది కుటుంబాల జీవనాధారం. తెలంగాణ గ్రామీణ, పట్టణ జీవనాన్ని కలిపే నాడి. విద్యార్థి నుంచి వృద్ధుడి వరకు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైన ప్రజా రవాణా వ్యవస్థ. అలాంటి సంస్థను బలోపేతం చేయడం అంటే ప్రజా ప్రయోజనాన్ని కాపాడటం. కార్మికుల సంక్షేమం అంటే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేయడం. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ ఉద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి బాధపెట్టింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారిని భాగస్వాములుగా చూస్తోంది. అదే అసలు తేడా. అదే ప్రజాస్వామ్య పరిపాలన.**



ఇటీవల కరీంనగర్లో పట్టపగలు జరిగిన జ్యువెలరీ షాపుపై దోపిడీ, కాల్పుల ఘటన ఒక్కసారిగా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కస్టమర్ల ముసుగులో వచ్చిన దుండగులు కేవలం కొన్ని నిమిషాల్లోనే కోట్లాది రూపాయల అభరణాలు దోచుకెళ్లారు. పైగా ఎదురు తిరిగిన సిబ్బందిపై కాల్పులకు తెగబడటం నేర ప్రపంచం ఎంత వేగంగా, ఎంత వ్యూహాత్మకంగా మారిందో స్పష్టం చేసింది. ప్రశాంతతకు, సామాజిక చైతన్యానికి పేరుగాంచిన కరీంనగర్ వంటి నగరంలో ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం సహజంగానే ప్రజల్లో కొంత భయాందోళనలు కలిగించింది. అయితే ప్రతి పెద్ద ఘటన ఒక ప్రశ్నను మాత్రమే కాదు, ఒక గుణపాఠాన్ని కూడా నేర్పుతుంది. కరీంనగర్ ఘటన కూడా అలాంటిదే. ఇది కేవలం ఒక దోపిడీ కేసు కాదు. మారుతున్న నేర ధోరణులు, పట్టణీకరణతో పెరుగుతున్న సవాళ్లు, భద్రతా వ్యవస్థల్లో అవసరమైన సంస్కరణలు, సమాజ బాధ్యత.. ఈ నాలుగు అంశాలపై లోతుగా ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తుచేసిన హెచ్చరిక. ఈ ఘటన జరిగిన వెంటనే విమర్శల రాజకీయాలు మొదలవడం సహజమే. ఏ సంఘటన జరిగినా అధికార పక్షం, ప్రతిపక్షం పరస్పర విమర్శలు చేసుకోవడం మన రాజకీయ సంస్కృతిలో భాగమైపోయింది. కానీ ఇలాంటి సందర్భాల్లో అసలు ప్రశ్న "ఘటన జరగడానికి ఎవరు బాధ్యులు?" అనేది మాత్రమే కాదు. దుండగులకు తగిన శాస్తి జరగాల్సిందే. వారిపై కఠినంగా వ్యవహరిస్తేనే ఇలాంటి ఘటనలు మరోసారి చేయకుండా ఉంటారు. "ఈ ఘటన ఎందుకు జరిగింది? మళ్లీ జరగకుండా ఎలా అడ్డుకోవాలి?" అనేదే ప్రధాన చర్చ జరగాలి. రాష్ట్రంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్నా, అనుకోని సమయంలో ప్రణాళికాబద్ధ నేరాలు చోటుచేసుకునే అవకాశం ఒక్కోసారి ఉంటుంది. అందుకే ఒక్కో ఘటనను ఆధారంగా చేసుకుని మొత్తం భద్రతా వ్యవస్థను విఫలమైందిగా చిత్రీకరించడం సమంజసం కాదు. అదే సమయంలో, ఇలాంటి సంఘటనపై వ్యవస్థలో ఎక్కడైనా లోపాలున్నాయా అనే ఆత్మపరిశీలనకు అవకాశంగా తీసుకోవాలి. ప్రజాస్వామ్యంలో విమర్శ అవసరమే, కానీ అది పరిష్కార మార్గాలు చూపించే నిర్మాణాత్మక విమర్శ అయి ఉండాలి. ఈ ఘటనలో గమనించాల్సిన అత్యంత కీలక అంశం నేరస్థుల ప్రణాళికా పద్ధతి. ఇది ఆకస్మికంగా జరిగిన చర్యగా కనిపించలేదు. లక్ష్యాన్ని ముందుగానే ఎంపిక చేసుకోవడం, సమయాన్ని ఖరారు చేయడం, పరిస్థితులను అంచనా వేయడం, తప్పించుకునే మార్గాలను సిద్ధం చేసుకోవడం వంటి అంశాలు ఇందులో స్పష్టంగా కనిపించాయి. అంటే నేరస్థులు ఇప్పుడు సాంకేతికతను, సమాచారాన్ని, సమాజ నిర్లక్ష్యాన్ని ఆయుధాలుగా మార్చుకుంటున్నారనీ తెలుస్తోంది.

ఇది మనకు మరో కీలక సత్యాన్ని గుర్తుచేస్తోంది.. భద్రత అనేది స్థిరమైన వ్యవస్థ కాదు.. అది నిరంతరం అభివృద్ధి చెందాల్సిన ప్రక్రియ. ఇప్పటికీ చాలా వ్యాపార సంస్థలు భద్రతను ఒక ఖర్చుగా మాత్రమే చూస్తున్నాయి. కానీ నేటి పరిస్థితుల్లో భద్రత అనేది పెట్టుబడి. ముఖ్యంగా బంగారం, నగదు, విలువైన వస్తువులతో వ్యాపారం సాగించే వ్యాపారులు, సంస్థలు సంప్రదాయ పద్ధతుల నుంచి బయటకు రావాలి. సీసీ కెమెరాలు ఉన్నాయా లేదా అనేది కాదు.. అవి పనిచేస్తున్నాయా? వాటి రికార్డింగ్ నాణ్యత ఎలా ఉంది? ప్రత్యక్ష పర్యవేక్షణ ఉందా? అత్యవసర హెచ్చరిక వ్యవస్థ ఉందా? సిబ్బందికి సంక్షోభ సమయాల్లో ఎలా స్పందించాలో శిక్షణ ఇచ్చారా? అనేవి అసలు ప్రశ్నలు. ఆ మేరకు వ్యాపారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు కొంత వరకు నియంత్రించే అవకాశం ఉంటుంది.కరీంనగర్ ఘటన మరో సామాజిక వాస్తవాన్ని కూడా మన ముందుంచింది. సామూహిక అప్రమత్తత తగ్గిపోవడం.ఒకప్పుడు గ్రామాలు, పట్టణాల్లో ప్రతి వ్యక్తి తన పరిసరాలపై కన్నేసి ఉండేవాడు. కొత్త వ్యక్తి వస్తే గమనించేవారు. అనుమానాస్పద కదలిక కనిపిస్తే వెంటనే స్పందించేవారు. ఇప్పుడు సాంకేతికత పెరిగిన కొద్దీ వ్యక్తిగత ప్రపంచాల్లో మునిగిపోయి సామాజిక అప్రమత్తత తగ్గిపోతోంది. నేరస్థులు ఇదే బలహీనతను ఆసరాగా చేసుకుంటున్నారు.భద్రతా వ్యవస్థల పరంగా చూస్తే, పోలీసులు ఘటన జరిగిన తర్వాత వేగంగా స్పందించి దర్యాప్తు ప్రారంభించడం అభినందనీయం. క్లూస్ టీమ్‌లు, ఫోరెన్సిక్ బృందాలు, గాలింపు చర్యలు ప్రజల్లో భరోసా కల్పించాయి. ప్రజలు సమష్టిగా నేరాలు నియంత్రణకు కృషి చేస్తే పోలీసులకు కొంత ఉపశమనం కలుగుతుంది. కొత్త డిజిపి సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టిన మూడు రోజులకే ఈ ఘటన చోటు చేసుకోవడంతో కేసును సీరియస్ గా తీసుకున్నారు. ఇందులో భాగంగా దుండగులను పట్టుకునేందుకు 16 పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర బీహార్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. అదేవిధంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఈ కేసును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దుండగులను పట్టుకునే విషయంలో కొంత పురోగతి కనిపిస్తున్నది. భవిష్యత్తు దృష్ట్యా పోలీస్ యంత్రాంగం ముందస్తు నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ, ఇంటెలిజెన్స్ సేకరణ, డిజిటల్ ట్రాకింగ్, వ్యాపార కేంద్రాల భద్రతా ఆడిట్ వంటి చర్యలు మరింత సమర్థవంతంగా అమలు కావాలి. అయితే ఈ మొత్తం చర్చలో అత్యంత ముఖ్యమైన అంశం భద్రతను కేవలం ప్రభుత్వ బాధ్యతగా చూడకూడదు. ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుంది. పోలీసులు అమలు చేస్తారు. కానీ భద్రతకు మొదటి రక్షణ కవచం ప్రజల అప్రమత్తతే. ఒక వ్యాపారి తన సంస్థను భద్రంగా ఉంచుకోవాలి. ఒక పౌరుడు అనుమానాస్పద కదలికలను గమనించాలి. ఒక సమాజం పరస్పర సహకారంతో భద్రతా సంస్కృతిని పెంపొందించాలి. కరీంనగర్ ఘటన మనకు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది.. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంత ముఖ్యమో, భద్రతా సంస్కృతి అంతకంటే ముఖ్యమైనది. ఈ ఘటనను కేవలం కొన్ని రోజుల వార్తగా మర్చిపోతే మనం ఏమీ నేర్చుకోనట్టే. దీన్ని ఒక హెచ్చరికగా తీసుకుని సమాజం, ప్రభుత్వం, వ్యాపార వర్గాలు కలిసి ఆత్మపరిశీలన చేసి నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటేనే ఈ సంఘటనకు నిజమైన అర్థం ఉంటుంది. ఎందుకంటే నేరం జరిగిన తర్వాత విచారం వ్యక్తం చేయడం కంటే, అది జరగకుండా ముందుగానే అప్రమత్తంగా ఉండటం గొప్ప రక్షణ. అందుకే అప్రమత్తతే భవిష్యత్తు రక్షణకు తొలి అడుగు. ప్రజలంతా కలిసి సమష్టిగా కృషి చేస్తే నేరాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంటుంది. ఆ విధంగా ముందుకు పోతే తప్పకుండా ఫలితం ఉంటుంది.



- గొట్టిముక్కుల బ్రహ్మచారి
9441884389

# అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీల్లో సింగరేణి విజయకేతనం

- భూగర్భ రెస్క్యూ విభాగంలో ప్రథమ బహుమతి
- జాంబియాలో జరిగిన పోటీలలో ప్రతిభ చాటిన సింగరేణి రెస్క్యూ బృందం
- అభినందనలు తెలిపిన సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి
- సోషల్ మీడియాలో కార్మికులు అధికారుల ప్రశంసల హర్షం
- రెండు దశాబ్దాల తరువాత అంతర్జాతీయ స్థాయిలో సింగరేణికి బహుమతి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఇటీవల జాంబియా దేశంలో జరిగిన అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలలో సింగరేణి జట్టు తన ప్రతిభను చాటి భూగర్భ రెస్క్యూ విభాగంలో ప్రథమ బహుమతిని సాధించి విజయకేతనం ఎగుర వేసింది. ప్రపంచం లోని పలు దేశాల రెస్క్యూ జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో భారత్ నుంచి కోల్ ఇండియాతో పాటు సింగరేణి, మరికొన్ని కంపెనీలు కూడా పాల్గొన్నాయి. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణి మరోమారు అత్యుత్తమ ప్రతిభ కన బరిచి సత్తా చాటడం విశేషం. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు జాంబియా దేశంలో ఈ పోటీలు జరిగాయి. వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించగా వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నిర్వాహకులు ప్రక టించారు. భూగర్భ గనులలో ప్రమాదాల సమయంలో రెస్క్యూ బృందం సేవలపై నిర్వహించిన పోటీలో ఫైర్ ఫైటింగ్ కు 20 మార్కులు, రెస్క్యూకు 20 మార్కులు, సాంకేతిక సహాయానికి 10 మార్కులు ఉండగా సింగరేణి జట్టు అత్యద్భుత ప్రతిభ కనబరిచి ఇతర కంపెనీల అన్నిటికన్నా మిన్నగా నిలిచి ప్రథమ బహు మతిని కైవసం చేసుకుంది.

**భూగర్భ రెస్క్యూ పోటీ ఈ విధంగా కొనసాగింది..**

ముందుగా ముఫూలిరా పట్టణంలోని మోపాని సెంట్రల్ ట్రైనింగ్ సెంటర్ లో 90 నిమిషాల నిడివి గల టెక్నీషియన్ టెస్టును నిర్వహించగా సింగరేణి నుంచి సాయి కృష్ణ ఈ టెస్ట్ ను 52 నిమిషాల్లో వి జయవంతంగా పూర్తి చేశాడు. కార్బన్ దయాక్సైడ్ అబ్జార్బ్ క్యానిస్టర్ లో తలెత్తిన లోపాలను సవరించి తిరిగి దానిని నింపడం వంటి ప్రక్రియను వేగంగా పూర్తి చేశాడు. తర్వాత 700 మీటర్ల లోతులో భూగర్భ గనిలో ప్రమాదం బారిన పడిన ఇద్దరిని వెతకడం, రక్షించడం అనే పోటీ నిర్వహించారు. దీనిని అదే పట్టణంలో ఉన్న వెస్ట్ పోర్టల్ మైన్ లో నిర్వహించారు. దీనికి రెండు గంటల సమయాన్ని కేటాయించినప్ప టికీ మన సింగరేణి జట్టు కేవలం 52 నిమిషాల్లో ఈ పోటీని విజయవంతంగా పూర్తి చేసింది. ఈ పోటీలో ముందుగా పంపుకి ఎల్ బెండును పెట్టడం సబ్ స్టేషన్ లో విద్యుత్తు నిలిపివేయడం ఇవ్వబడిన మైన్ ప్లాన్ ప్రకారం తప్పిపోయిన ఇద్దరు వ్యక్తుల ఆచూకీని వేగంగా కనుగొనడం చేశారు. ఇందులో ఒక వ్యక్తి ఎల్.హెచ్.డి యంత్రం సమీపంలో స్పృహ లేకుండా పడి ఉండగా అతనికి ఊపిరి అందేలా చేసి రక్షించా రు. మరొక వ్యక్తి గాయాలతో పడి ఉండగా అతన్ని పూర్తి రెస్క్యూ పద్ధతిలో 700 మీటర్ల పైన ఉన్న గని ఉపరితలానికి విజయవంతంగా తరలించారు. ఈ మొత్తం పోటీని ఇద్దరు జడ్జీల టీం పరిశీలించింది. పై విభాగాలలో సింగరేణి యువ రెస్క్యూ జట్టు ఎంతో అప్రమత్తంగా, ఉత్సాహంగా, క్రమశిక్షణతో పాల్గొని ఇచ్చిన సమయం కన్నా తక్కువ వ్యవధిలోనే పూర్తి చేసి అందరి ప్రశంసలు అందుకుంది.

**సింగరేణి యువ రెస్క్యూ టీంకు సింగరేణి సీఎండీ అభినందనలు..**

అంతర్జాతీయ స్థాయిలో సింగరేణి సంస్థ భూగర్భ గనుల రెస్క్యూ విభాగంలో ప్రథమ బహుమతి సాధించడం ఇటీవల కాలంలో ఇదే ప్రథమం. దీనిపై సంస్థ ఛైర్మన్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తన అభినందనలు తెలియజేశారు. అలాగే ఈ పోటీల్లో పలు బహుమతులు సాధించిన కోల్ ఇండియాకు చెందిన డబ్ల్యూ.సి.ఎల్ రెస్క్యూ జట్టుకు కూడా ఆయన అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో భారత దేశం నుండి కోల్ ఇండియా సింగరేణితో పాటు పలు కంపెనీలు పాల్గొన్నాయి. అలాగే చైనా, కొలంబియా, జాంబియా, కెనడా, ఆస్ట్రేలియా, పోలాండ్ ఇంకా ఇతర దేశాల జట్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటాయి. సింగరేణి రెస్క్యూ జనరల్ మేనేజర్ శ్రీని వాసరెడ్డి సారథ్యంలో రామగుండం మైన్స్ రెస్క్యూ స్టేషన్ లో సింగరేణి నుంచి ఎంపిక చేసిన జట్టుకు ప్ర త్యేక శిక్షణ ఇచ్చారు. సింగరేణి మైన్స్ రెస్క్యూ జట్టులో జి.ప్రమోద్ కుమార్, బి.నితిన్ కుమార్, ఎన్.భాను ప్రసాద్, ఎ.శ్యాం కుమార్, ఆర్.శ్రీకాంత్, సి.హెచ్. సాయి కృష్ణ , ట్రాన్స్ లేటర్ గా జి.రాజేందర్ రెడ్డి ఈ పోటీలలో పాల్గొన్నారు. కాగా దేశంలోనే తొలిసారిగా ఈ పోటీలకు ఫస్ట్ ఎయిడ్ విభాగానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించడం కోసం సింగరేణి సంస్థలో పని చేస్తు న్న డాక్టర్ రాజేశ్వర్ ను అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ నిర్వాహకులు ఆహ్వానించారు. డాక్టర్ రాజేశ్వర్ ఈ అంతర్జాతీయ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిం చారు. సింగరేణి రెస్క్యూ జట్టు అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు సాధించటంపై సింగరేణి ఉద్యోగులు, అధికారులు వివిధ మాధ్యమాలలో తమ అభినందన లు తెలుపుతున్నారు.

# వివక్షత లేని సమాజం కమ్యూనిస్టులు కర్తవ్యం

## గుంపెళ్ళగూడెంలో సీపీఐ(ఎం) కార్యకర్త వీరబాబు వర్ధంతి



**కారేపల్లి, మహా :** కుల, మత, ప్రాంత, ఆర్థిక అసమా నతలు, వివక్షత లేని సమాజ నిర్మాణం కమ్యూనిస్టుల కర్తవ్య మని సీపీఐ(ఎం) సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర అన్నారు. బుధవారం గుంపెళ్ళగూడెంలో సీపీఐ(ఎం) కార్యకర్త ఎర్రబెల్లి వీరబాబు 18వ వర్ధం తికి జరిగింది. ఈ సందర్భంగా వైరా డివిజన్ సీపీఐ (ఎం) కమిటీ సభ్యులు వజ్జా రామారావు అధ్యక్షతన జరిగిన సభలో కే.నరేంద్ర మాట్లాడుతూ భారతదేశం లో జీవిస్తున్న అన్ని వర్గాల ప్రజలకు విద్య, ఉపాధి అవ కాశాలు కల్పించడం, సంపదను అనుభవించే హక్కు కల్పించటం కమ□్యనిస్టులతోనే సాధ్యమన్నారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఎన్నికలు కేవలం తంతు మాత్రమేనని ప్రజాస్వామ్య బద్దంగా జరగటం లేదన్నారు. అవకతవకలు, ప్రలోభాలు కల్పించకుం డా ఓటర్ తమ ఓటు హక్కును వినియోగించుకొని ననాడు, దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిగినప్పు డు నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. రాజ్యాంగ బద్ధంగా స్వతంత్రంగా పని చేయవలసిన ఎన్నికల కమిషన్‌ను బీజేపీ ప్రభుత్వం తమ జేబు సంస్థగా మార్చారన్నారు. ప్రజలను చైతన్య పరచడ మే కమ్యూనిస్టుల కర్తవ్యమని, సమస్యలపై పోరాడడం ఎర్రబెల్లి వీరబాబు కి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. అంతకు ముందు వీరబాబు స్తూపం వద్ద సీ పీఐ(ఎం) సీనియర్ నాయకులు తుమ్మోజు రామ్మూర్తి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు గుర్రం వెంకన్న, శాఖ కార్యదర్శి పాపిని నాగేశ్వరరావు, నాయకులు పొట్లకాయల రమేష్, కే.కోటయ్య, కావేటి రాములు, బత్తుల సర్వయ్య, ఎర్రబెల్లి వెంకటేశ్వర్లు, జీవిత వీరబాబు, వీరబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# 8న కోటమైసమ్మ ఆలయ దుకాణాల వేలం

**కారేపల్లి, మహా :** ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ ఆలయ దుకాణాల వేలం పాటను ఈనెల 8వ తేదిన ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈవో కొండకింది వేణుగోపాలాచార్యులు, ఆలయ ట్రస్టీ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు లు తెలిపారు. ఆలయ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ టెంటు సామాన్లు అద్దెకు ఇవ్వటా నికి, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుటకు ఈ ఏడాది జూలై మాసం నుండి 2027 మే 2027 వరకు ఒక ఏడాది పాటు లీజుకు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆలయంకు చెందిన షాపు నెం.1,2,3,4,5,6,7 షాపులను నెల కిరాయికి బహిరంగ వేలంపాట ద్వారా ఇవ్వటం జరుగుతుందన్నారు. మే 2026 నుంచి ఏప్రిల్ 2027 వరకు షాపులకు లైసెన్స్ కాలపరిమితి 12 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. 12 నెలల షాపు కిరాయి మొత్తం సొమ్మును వేలంపాట ముగిసిన వెంటనే చెల్లించి తగు రశీదు పొందవలయును. లేనియెడల పాట రద్దుపరిచి తిరిగి వేలంపాట నిర్వహిస్తామన్నారు. చెల్లించిన డిపాజిట్ తిరిగి ఇవ్వటం జరగదన్నారు. వివరాలకు కార్యాల యంను సందర్శించాలని తెలిపారు.

# కొట్లాడి పథకాలు తెచ్చా..

## అధికారుల పనితీరుతోనే ప్రభుత్వానికి పేరు



**కారేపల్లి, మహా :** వైరా నియోజవర్గంలో కొట్లాడి పథకాలు తెచ్చానని వాటిని సద్వినియోగం చేసుకో వాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం కారేపల్లి మండలం అప్పాయి గూడెం రైతు వేధికలో సహకారశాఖ, రైతు ఉత్పత్తిదా రుల సంస్థ, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాపాలన `ప్రగతి నివేదిక (99 రోజుల యాక్షన్ ప్లాన్) కార్యక్రమాన్ని సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివా సరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలో అత్య ధికంగా మొక్కజొన్న సాగు జరిగిందని మంత్రులు, అధికారులతో కొట్లాడి కొనుగోలు కేంద్రాలు సాధిం చానన్నారు. ఇతర జిల్లాలకు మొక్కజొన్నలు ట్రా న్స్‌పోర్ట్ చేయటంతో లారీ కొరత ఏర్పడిందని, దానికి నిరుపయోగంగా ఉన్న అప్పాయిగూడెం గోదాంను తెరిపించి ట్రాక్టర్ల ద్వారా గోదాంకు తరలించే ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా వ్యవసాయశాఖ, సోసైటీ అధికారులు, సర్పంచ్‌లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బ్యాంకులను వినియోగించుకోని ఉన్నతంగా ఎదగా లని ఆకాంక్షించారు. సక్రమంగా రెన్యూవల్ చేసుకో ని ప్రభుత్వ రాయితీలు పొందాలన్నారు. అధికారులు సూచించినట్లు పంటల మార్పిడి చేసుకోవాలని, పామాయిల్ పంటను వేసుకోవాలన్నారు. కొణిజర్ల లో పామాయిల్ ప్యాక్టరీ మంజూరు చేయించినట్లు తెలిపారు. అధికారుల పని తీరుతోనే ప్రభుత్వానికి పేరు వస్తుందన్నారు. రైతు రుణమాఫీ 85 శాతం పూర్తి అయిందని, సాంకేతిక కారణాలతో 15 శాతం పూర్తి కాలేదన్నారు. బ్యాంకర్లు రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణాల పంపిణిలో ఇబ్బందులు సృష్టిం చవద్దని కోరారు. ఈకార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గుడివాడ మేరి, ఏవో బీ.అశోక్‌కు మార్, సర్పంచ్‌లు దండు ప్రవీణ్, దారావత్ హేమల తబాలాజీ, బానోత్ హీరాలాల్, మాలోత్ బావుసింగ్, దారావత్ మంగీలాల్, డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, కొత్తూరి రామారావు, మర్సకట్ల రోషయ్య, దేగల ఉపేందర్, బ్యాంకు మేనేజర్లు బాల రవికుమార్, బొల్లు హనుమంతరావు, తోటకూరి రాము, రవీంద ర్‌నాయక్, కొంగర వేణు, ఏఈలు వెంకన్న, నాగయ్య, రాజశేఖర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు



# ఒలింపియాడ్ విజేతకు.., టెన్త్ టాపర్లకు..

- ఏరియా జీఎం రామచందర్ అభినందనలు..
- ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని జీఎం దిశానిర్దేశం..

**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియాలోని పివి కాలనీ సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించిన ప్రతిభాపాటవంపై మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి సైన్స్ ఒలింపియాడ్ విజేతతో పాటు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం తన కార్యాలయంలో ప్ర త్యేకంగా అభినందించారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ ఒలింపియాడ్‌లో సింగరేణి పాఠశాల తరపున పాల్గొని ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్, ల్యాప్‌టాప్ గెలుచుకున్న విద్యార్థి కేతన్ శశి సహదేవ్ కుమార్‌ను జీఎం ప్రత్యేకంగా అభినం దించారు. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సింగరేణి పాఠశాల 98 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పాఠశాల టా పర్లుగా నిలిచిన ఎస్ హంసనందిని 547 మార్కులు, జి సంకీర్తన 545 మార్కులు, కే శ్రీకృష్ణ కౌశిక్ 543 మార్కులతో పాటు 500కు పైగా మార్కులు సాధించిన ఇతర విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జీఎం దుర్గం రామచందర్ మా ట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలం టే ఇప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. ఆ లక్ష్య సాధన కోసం పక్కా ప్రణాళికతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. సింగరేణి సంస్థకు, తల్లిదండ్రులకు మరింత పేరు ప్రఖ్యా తులు తీసుకురావాలని ఆకాంక్షించారు



# ఉప్పరిగూడ పిఎసిఎస్ చైర్మన్‌గా పాండురంగారెడ్డి బాధ్యతలు

- సంతోషం వ్యక్తం చేసిన పాలకవర్గం
- రైతులకు అందుబాటులో ఉంటాం చైర్మన్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఉప్పరిగూడ కోఆపరే టివ్ బ్యాంక్ చైర్మన్ గా, ఏదుల్ల పాండురంగారెడ్డి, మరోసారి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి నెలలో పిఏసిఎస్ సంఘం కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది నాటి నుంచి బ్యాంక్ సెక్రటరీతో నిర్వహణ కొనసాగించారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం గత పాలకవర్గాన్ని యధావిధిగా కొనసాగించాలని తెలపడంతో, బుధవారం ఉప్పరిగూడ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్గా ఏదుల పాండురంగారెడ్డి, డైరెక్టర్లతో కలిసి పాలకవర్గం బాధ్యతలు చేపట్టడం జరిగింది. అనంతరం చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం యధావిధిగా కొనసాగించడం సంతోషం వ్యక్తం చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలు పరిష్కరించి, రైతులకు కావాల్సిన రుణాలను సకాలంలో అందించడం జరు గుతుందని ఆయన అన్నారు.

# అంబులెన్స్ తరలింపుపై సర్పంచ్ ఆందోళన



**చర్ల మహా :** చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ తుర్రం రవికుమార్ సత్య నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన అంబులెన్స్‌ను చర్లకు తరలించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చర్ల మండలంలోని తేగడ నుండి రాళ్లగూడెం వరకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రమాదకర ప్రాంతం ఉందని తెలిపారు. గతంలో అక్కడ గాయపడిన వారిని సత్వరంగా సత్యనారా యణపురం ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ ఎంతో ఉపయోగపడేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ఉన్న ఒక్క అంబులెన్స్‌ను చర్ల మండల ఆస్పత్రికి తరలించడం వల్ల సత్యనారాయణపురం మరియు పరిసర గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి, ప్రజల ప్రా ణాలకు సంబంధించిన ఈ కీలక అంశాన్ని దృష్టిలో ఉంచుకుని, సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన అంబులెన్స్‌ను తిరిగి అక్కడికే కే టాయించాలని సంబంధిత అధికారులను ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కణితి రాజిని, గొర్స పవన్ చారి, కాసర్ల బన్ను, పాండవుల నాగరాజు, దానవాయిపేట రూంజా రాజా తదితరులు పాల్గొ న్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించి తీసుకునే నిర్ణయాలు స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఘనంగా పాయం వెంకటేశ్వర్లు పుట్టినరోజు వేడుకలు



**బూర్గంపహాడ్, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు జన్మదినాన్ని బూర్గంపహాడ్ మండల కేంద్రంలో అభిమానులు అత్యంత ఘనంగా నిర్వ హించారు. అంబేద్కర్ సెంటర్ ప్రధాన కూడలిలో జరిగిన ఈ వేడుకలు భారీ జనసందోహంతో కళకళలాడాయి. పాయం యువసేన నాయకుడు భజన ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చుతూ, మిఠాయిలు పంచుతూ రంగుల హర్షాతిరేకంలో పుట్టినరోజు వేడుకలను జరిపారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేస్తున్న నాయకుడిగా పాయం వెంకటేశ్వర్లు గారిని అభి నందిస్తూ అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కా రం కోసం కృషి చేస్తున్న ఆయనకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా బూర్గంపహాడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజానాయకుడిగా పాయం గారు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించా రు. వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించాయి.

# అమైటి ఇండియా షో రూమ్ ప్రారంభించిన వైరా ఎమ్మెల్యే

## ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగం వైరా ఎమ్మెల్యే



**కారేపల్లి, మహా:,** ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజా అవ సరాలకు అనుగుణంగా వస్తువుల ధరలు ఉంటే ఉపయోగకరంగా ఉంటుందని ఆరోగ్య పరిరక్షణ అమైటి ఇండియా వస్తువులు ఎంతో ఉపయోగపడ తాయని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. మండల కేంద్రమైన కారేపల్లి లో ఆమెటి ఇండియా ఫ్రాంచెస్ నిర్వాహకులు హనుమ కొండ రమేష్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ హనుమకొండ కాంప్లెక్స్ లో ఏర్పాటుచేసిన శ్రీ లక్ష్మీ వేద ఆర్యన్ ఇవి సోలార్ అండ్ జనరల్ స్టోర్స్ ను వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్రాంచెజ్ వస్తు వులు ప్రజల ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయి అనేది నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా అవసరాలను గుర్తించడంతోపా టు ఆరోగ్య పరిరక్షణకై అమెటి ఇండియా చేస్తున్న కృషిని కొనియాడారు. నిత్య జీవితంలో ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న తరుణంలో ఏజెన్సీ ప్రాం తాల్లో ప్రజలకు ఉపయోగపడేలా స్టోర్ను ప్రారంభిం చడం అభినందనీయం అన్నారు.. ఈ కార్యక్రమంలో సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు. రిటైర్డ్ ఉద్యోగి బానోత్ సుందర్ లాల్. బానోతు రామ్మూర్తి నాయక్ .తిరు వెంగళయ్య. అభిరామ్. బంటు ఐలయ్య .వి నరేష్. శేఖర్ .ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు. రావూరి శ్రీనివాసరావు .ఉన్నం వీరేందర్ .తోటకూరి శ్రీనివాసరావు. కారేపల్లి ఎస్సై బైరు గోపి .కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచులు పాల్గొన్నారు.



# వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మంచాల మండలం అస్మత్ పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో అభయాంజనేయస్వా మి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం, ఆలయానికి వెళ్లిన ఎమ్మెల్యే మల్ రెడ్డి..... స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా ఏర్పడి, ప్రగ తిపథంలో సాగుతున్న అస్మత్ పూర్ గ్రామంలో ఆం జనేయస్వామి ఆశీస్సులతో... ప్రజలంతా సుఖశాం తులతో వర్ధిల్లాలని వేడుకున్నట్లు ఆయన చెప్పారు. సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ పల్లెలు పుట్టినిల్లులాంటివని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల నమ్మకాలను గౌరవించేలా పండుగలు, ఆలయాల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తు న్నట్లు చెప్పారు. ఆలయ నిర్మాణానికి నిధులు సమ కూర్చిన వెంకటేశ్వర రెడ్డిని ఎమ్మెల్యే అభినందించా రు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్లు పాండురంగ రెడ్డి, హనుమంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శివకుమార్, ఆలయ నిర్మాణ కర్త వెంకటేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# సుదీర్ఘకాలం సేవలందించిన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి



## చర్లపల్లి కాంగ్రెస్ నాయకుల డిమాండ్

**కుషాయిగూడ, మహా :** కాంగ్రెస్ పార్టీ కోసం సంవత్స రాలుగా కృషి చేస్తున్న కార్యకర్తలను పార్టీ అధిష్ఠానం గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని చర్లపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సమావేశం బుధవారం ఈసి నగర్‌లోని కమిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. తమ అభి ప్రాయాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం యాదగిరి మాట్లాడుతూ.. పార్టీపై నమ్మకంతో ఎన్నో ఏళ్లుగా నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పోషిస్తు న్నారని అన్నారు. ఎన్నికలలో పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయినా, వెనుకడుగు వేయకుండా పార్టీ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్య కర్తలు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. వారిని సాదరంగా ఆహ్వానిస్తూ ఐకమత్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అయితే గ్రేటర్ మల్కా జిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుతో కొత్త డివిజన్లు ఏర్పడిన నేపథ్యంలో ఉమ్మడి చర్లపల్లి డివిజన్‌లో నూతన కమిటీ ఏర్పాటు సమయంలో సుదీర్ఘకాలంగా సేవలందించిన సీనియర్ నాయ కులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి వారి గత రాజకీయ ప్రస్థానం, సేవలను పరి గణనలోకి తీసుకుని సముచిత స్థానం కల్పించాలని సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



# నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే పాయం జన్మదిన వేడుకలు..

## మణుగూరులో రక్తదానం.. అన్నదానం కార్యక్రమాలు

**మణుగూరు, మహా :** పినపాక నియోజకవర్గ శాసనసభ్యు డు పాయం వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు మణుగూరుతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వ హించారు. మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి ఆనందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సేవలను కొనియాడుతూ నాయకులు, కార్యకర్త లు, ప్రజలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవలో భాగంగా కార్యకర్తలు రక్తదాన శిబిరం నిర్వహించగా, నియోజకవర్గ ప్రజలకు అన్నదానం చేప ట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మణుగూరు, అశ్వా పురం, పినపాక, కరకగూడెం మండలాల నాయకులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొండిగౌరెల్లిలో భూ అక్రమార్కులు..!

## భూ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## గ్రామ సర్పంచ్ రమాదేవి, ఎమ్మెల్యే రంగారెడ్డికి ఫిర్యాదు

## ప్రభుత్వ భూములను కాపాడాలని ఎమ్మెల్యేను కోరిన సర్పంచ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మొండిగౌరెల్లి గ్రామంలో భూ అక్రమాలకు పాల్పడ్డ గ్రామ మాజీ సర్పంచ్, మాజీ వార్డ్ నెంబరుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యే రంగారెడ్డికి గ్రామ సర్పంచ్ కొలను రమాదేవి ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, మొండిగౌరెల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 127లో అక్రమంగా భూ కబ్జాకు పాల్పడిన మాజి సర్పంచ్ బండి మీది కృష్ణ, మాజి వార్డ్ మెంబెర్ ఎట్టి లక్ష్మయ్య పై చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి, మొండిగౌరెల్లి గ్రామ సర్పంచ్ కొలను రమాదేవి, యాచారం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ... మొండిగౌరెల్లి గ్రామంలో సర్వే నెంబరు 19 68 127లో గల అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకోవడం జరుగుతుందని గత సంవత్సరంలో సంబంధిత అధికారులు తెలపడం జరిగింది. ఈ యొక్క గ్రామంలో సర్వేయర్ చే సర్వే జరుగుతున్న సమయంలో సర్వేను అడ్డుకున్న, మాజి సర్పంచ్ బండి మీది కృష్ణ, మాజి వార్డ్ మెంబెర్ ఎట్టి లక్ష్మయ్య పై చర్యలు తీసుకోవాలని, అదేవిదంగా సర్వేనెంబర్ 127 లో 5 ఎకరాల భూమి కబ్జా చేసి 400, 500 గజాల చొప్పున కొంతమందికి విక్రయించి మరి కొంత భూమిలో కంచా వేసుకొని కబ్జాలో ఉన్న అక్రమాలకు పాల్పడ్డ వీరిద్దరిపై కఠిన చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిని కా పాడాలని ఎమ్మెల్యే రంగారెడ్డిని, తన పాలకవర్గం, గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందించి, చర్యలు తీసుకోవాలని కోరినట్లు గ్రామ సర్పంచ్ రమాదేవి మల్లారెడ్డి తెలిపారు. గత వారం రోజుల క్రితం ఇబ్రహీం పట్నం ఆర్డీఓ అనంతరెడ్డికి, యాచారం మండలం ఎమ్మార్వో అయ్యప్పకు మండల ఎంపీడీవో ఎంపీవోకు ఫిర్యాదు చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ రమాదేవి మల్లారెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డికి తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రంగారెడ్డి, అధికారులతో చర్చించి, వారు ఎవరైనా సహించేది లేదని తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. వీరిద్దరూ ఈ యొక్క గ్రామంలో కొంతమంది వద్ద లక్షల్లో డబ్బు తీసుకొని, నకిలీ భూ పాస్ పుస్తకాలు అధికారులచే ఇప్పించినట్లు సర్పంచ్ రమాదేవి ఆరోపించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు తాండ్ర రవీందర్, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆదర్శ నియోజకవర్గంగా ఇబ్రహీంపట్నం...



- స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి
- గునుగల్, గడ్డమల్లయ్యగూడెంలో శంకుస్థాపనలు
- కాంగ్రెస్ గూటికి గడ్డమల్లయ్యగూడెం సర్పంచ్ మంగజంగయ్య

**మహా:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చినా.... 9ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇబ్రహీంపట్నం ప్రాంతం అభివృద్ధిలో వెనకబడిందని..... తన నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దటమే లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. యాచారం మండలం గునగల్, గడ్డమల్లయ్యగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. రూ.1.20కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి కార్యక్రమాలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గడ్డమల్లయ్యగూడెం సర్పంచ్ మంగా జంగయ్య ఎమ్మెల్యే మల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. మల్ రెడ్డి రంగారెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులైనందునే ఆయన వెంట నడిచేందుకు సిద్ధమైనట్లు వారు తెలిపారు. రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కావాల్సిన నిధులను అడిగిన వెంటనే మంజూరు చేస్తున్నట్లు చెప్పిన ఎమ్మెల్యే.... ప్రజాప్రభుత్వంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గడ్డమల్లయ్యగూడెంలో ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు పాండురంగారెడ్డి, హనుమంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు నరసింహ, గ్రామ సర్పంచ్ మంగా జంగయ్య, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బల్దియాలో చివరి సర్వసభ్య సమావేశం

- ముగిసిన కార్పొరేటర్ల పదవీకాలం
- రూ.76.56 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు
- నేమ్ బోర్డు లేకపోవడంపై ఎమ్మెల్సీ గరం



**మహా వరంగల్ బ్యూరో;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని కార్పొరేటర్ల పదవి కాలం నిన్నటితో ముగిసింది. ఈ సందర్భంగా బుధవారంబల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నగర మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన చివరి కౌన్సిల్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కౌన్సిల్ 20 అంశాలకు 76.56కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హన్మకొండ కలెక్టర్ బల్దియా ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయి, కార్పొరేటర్లు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఉద్దేశించి మేయర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో వరంగల్ నగరాన్ని సమగ్ర అభివృద్ధి పథంలో నడిపించామని తెలిపారు. పార్టీలకు అతీతంగా పాలకవర్గం సమష్టిగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టిందని అన్నారు.వరంగల్ ప్రజల దశాబ్దాల కల అయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్‌కు పునాది వేయడం కీలక విజయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నగరానికి భారీగా నిధులు మంజూరై అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.గత ఐదేళ్లలో రూ.3331 కోట్ల వ్యయంతో వేలాది అభివృద్ధి పనులు చేపట్టగా, వాటిలో చాలా వరకు పూర్తయ్యాయని తెలిపారు. వరదల సమయంలో ప్రజలకు అండగా నిలిచి సహాయ కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో ముంపు నివారణ కోసం నాలాల అభివృద్ధి, విస్తరణకు ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. రూ.100 కోట్ల ఎస్పీవీ నిధులతో రోడ్లు, డ్రైన్లు, బ్రిడ్జులు, చెరువుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రూ.25 కోట్ల స్పెషల్ ఫండ్, రూ.550 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో వరద నివారణ చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఖిలా వరంగల్ ఔటర్ మోటు అభివృద్ధి ద్వారా వరద ముప్పు తగ్గించనున్నామని వెల్లడించారు.వరంగల్, హనుమకొండ, కాజీపేట సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించామని, ఈ సందర్భంగా సహకరించిన ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరికీ మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య ఆమె మాట్లాడుతూ, చారిత్రక ప్రాధాన్యత కలిగిన వరంగల్ నగరాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని, ఇందుకు అవసరమైన నిధులు కూడా మంజూరయ్యాయని స్పష్టం చేశారు. నగరాభివృద్ధిలో భాగంగా ఎయిర్‌పోర్ట్, కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్టైల్ పార్క్ వంటి కీలక ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషితో పెండింగ్ నిధులు విడుదలవుతున్నాయని చెప్పారు. కార్పొరేటర్లు ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచిస్తూ, ప్రజాసేవ అధికారంతో మాత్రమే కాకుండా ప్రజల మధ్య ఉండటం ద్వారా కూడా సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్ సమస్యలను గుర్తించి సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ తరువాత వరంగల్ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. నగరానికి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ అంశాలపై స్పెషల్ ఆఫీసర్ పాలనలో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి నగరంలోని సమస్యలను సమగ్రంగా సమీక్షించాలని కోరారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అయితే అంతకుముందు సమావేశానికి కౌన్సిల్ హాల్ కు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య రాగానే కౌన్సిల్ సమావేశ టేబుల్ పై నేమ్ బోర్డు లేకపోవడంతో అధికారుల తీరు పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెంటనే టేబుల్ పై నేమ్ బోర్డ్ పెట్టిన అధికారులు ఆయనకు సర్ది చెప్పడంతో ఆయన శాంతించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్, అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్లు, బల్దియా అన్ని విభాగాల అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి సర్కార్ పెద్దపీట

- జోడెద్దుల్లా అభివృద్ధి - సంక్షేమం
- అర్హులందరికీ జాప్యం లేకుండా సంక్షేమ పథకాలు
- స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడి
- యాచారంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆడబిడ్డ పెళ్లికి భరోసా.. వారి కుటుంబానికి ధైర్యమే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 310మంది లబ్ధిదారులకు 3కోట్ల 10లక్షల 35వేల 390 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవలని, జాప్యం లేకుండా నిధులు మంజూరు అవుతున్నట్లు తెలిపారు. సంక్షేమం అభివృద్ధి జోడెద్దుల్లా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నరసింహ, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బల్దియా ఆవరణలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**మహా వరంగల్ బ్యూరో;** బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణ లో మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయం కోసం జనరల్ ఫండ్ నిధులు రూ.29 లక్షల అంచనా వ్యయం తో నిర్మించనున్న స్టాల్స్ తో పాటు, బల్దియా జనరల్ ఫండ్ నిధులు రూ.95 లక్షల అంచనా వ్యయంతో ఇండోర్ స్టేడియం సమీపం లో నిర్మించనున్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులకు లోక్ సభ సభ్యురాలు డా.కడియం కావ్య వరంగల్ (పశ్చిమ) శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వర్ధన్నపేట శాసన సభ్యులు కే ఆర్ నాగరాజు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ తో పాటు వివిధ డివిజన్ లకు చెందిన కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీలో పరిపాలన భవన ప్రారంభోత్సవం

**పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, కుడా చైర్మన్, జిల్లా కలెక్టర్**



**మహా వరంగల్ బ్యూరో;** హనుమకొండ సుబేదారి లోని రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. తలసీమియా బాధితుల కోసం వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న డైనింగ్ హాల్‌కు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి కార్యక్రమంలో పాల్గొన్నారు.అదే విధంగా, రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పరిపాలన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం హనుమకొండ రెడ్ క్రాస్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిని "రెడ్ క్రాస్ మార్గ్ "గా నామకరణం చేసి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రక్తదాన సేవల తో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తున్న రెడ్ క్రాస్ సేవలను అభినందించారు. తలసీమియా బాధితుల కోసం నిర్మించబడుతున్న డైనింగ్ హాల్ భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. డైనింగ్ హాల్‌ను నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు, మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ కు రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ డైనింగ్ హాల్ నిర్మాణ భూమిపూజలో పాల్గొని, టైలరింగ్ సెంటర్, జనరిక్ మెడికల్ షాప్, రెడ్ క్రాస్ పరిపాలన భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమం లో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ హెచ్. సంధ్యారాణి, బిళ్ళ రమణారెడ్డి, కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి , రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం నాడు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ పెద్దబుబ్బ గ్రామ పంచాయతీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం విజయ లక్ష్మి ,శ్రీనివాస్ తో బుచ్చయ్యపల్లి గ్రామపంచాయతీ తోపాటు బుచ్చయ్య పల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం సబ్ సెంటర్ ను బుచ్చయ్య పల్లి సబ్ సెంటర్ ను బుచ్చయ్యపల్లి గ్రామ సర్పంచ్ జాడి మహేశ్వర్ తో పాటు ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జక్కుల పవణ్ కల్యాణ్ వార్డ్ మెంబెర్స్ అగిడిసుగుణ, సుంకరిగట్టయ్య,బత్తులరమేశ్,అకెనపల్లి ఉప సర్పంచ్ తోట రవి ,సీసీ ప్రసాద్ గారు ,నాయకులు పెట్టంరాయలింగు,కర్ణాటక ఓదేలు,కొళవెంకటేశ్,జిత్తవేణి లసుమయ్య,నునె రాజ్కుమార్,రైతులు,మహిళా సంఘాల కార్యకర్తల పాల్గొన్నారు

## కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తులపై పెరిగిన ధరలు తగ్గించాలి

**సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహణ**



**బెల్లంపల్లి, మహా:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను, పెట్రోల్, డీజిల్ కొరత కు నిరసనగా బుధవారం రోజు బెల్లంపల్లిలో కాంట చౌరస్తా వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్యాస్ పెట్రోల్ డీజిల్ అధిక ధరలు కొరత వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారనీ,రాష్ట్రంలో పంట కోతల సమయంలో డీజిల్ లేకపోవడంతో రైతాంగం తీవ్రఇబ్బందులకు గురవుతున్నారనీ కొరతలేదని పాలకులు ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదనీ తీవ్రంగా విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్రప్రభుత్వం వాణిజ్య సిలిండర్ల ధరలను రూ.993 పెంచడంతో రూ.3100 కు చేరుకుందని,సామాన్య ప్రజలు డీజిల్ పెట్రోల్ మీద లీటరుకు రూ.5 / గృహ అవసరాల గ్యాస్ సిలిండర్ పై 50 రూపాయలు పెంచడానికి ఆయిల్ కంపెనీలు ప్రతిపాదనలు పంపించారనీ, అమెరికా సామ్రాజ్యవాద విధానాలను మోడీ ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. యుద్ధం కంటే ముందు బ్యారెల్ ముడిచమరు ధర 72 డాలర్లు ఉంటే నేడు 126 డాలర్లకు చేరుకున్నదనీ,తాజిగా కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్సిలిండర్ ధరలతో హోటల్స్, రెస్టారెంట్లు, చిన్న పెద్ద ఆహార వ్యాపారాల మీద తీవ్రమైన భారం పడుతున్నదని , పెట్రోల్, డీజిల్ ధరలు పెంచినట్లయితే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరుగుతుందనీ, విమాన యాన సంస్థలు ప్రస్తుతం పెరిగిన ఇథన ధరలకు అనుగుణంగా విమాన చార్జీలు కూడా పెంచాలని కేంద్రాన్ని కోరుతున్నాయనీ వెల్లడించారు. అమెరికా ఇరాన్ యుద్ధం వలన భారతదేశానికి ఎలాంటి ప్రమాదం లేదని, చమురు గ్యాస్ నిలువలు ఉన్నాయని పేర్కొన్న కేంద్రప్రభుత్వం ఎందుకు గ్యాస్ ధరలు పెంచుతున్నట్లు, పెట్రోల్ బంకుల వద్ద ఎందుకు బారులు తీరిన జనం ఉన్నారనీ,ప్రభుత్వం ఇచ్చే సమాధానికి వాస్తవానికి పొంతన లేదనీ విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, డిజిల్ కొరతలను తగ్గించాలనను, ఆయిల్ కంపెనీల ప్రతిపాదనలు ఆమోదించవద్దని కేంద్రాన్ని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ,జిల్లా సమితిసభ్యులు డిఆర్ శ్రీధర్, కొంకుల రాజేష్, రత్నం రాజం, మేకల రాజేశం, సీనియర్ నాయకులు జూపాక కొమురయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు బొంతల కళారాణి, కాస్పేట స్వర్ణలత, పట్టణ కార్యవర్గ సభ్యులు బొంకూరి రామచందర్,ఉప్పుల శంకర్, కే తిరుపతి, ఆంధ్రుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి అందేలా కృషి చేస్తా..

**ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య**



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని పడమర కోటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కీర్తిశేషులు పుట్ట మోహన్ కుమారుడైన పుట్ట రాకేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడనీ తెలుసుకున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య బుధవారం వారి నివాసానికి వెళ్లి రాకేష్ ను పరామర్శించారు. చికిత్స నిమిత్తం సుమారు 40 లక్షల రూపాయల ఖర్చవుతుందని ఈ సందర్భంగా రాకేష్ కుటుంబ సభ్యులు సారయ్య కు తెలుపగా, తామంతా కుటుంబానికి అండగా ఉంటామని ఏమాత్రం అధైర్య పడద్దని భరోసా ఇచ్చారు. నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి తగు చికిత్స అందించేలా చూస్తానని అలాగే చికిత్సకు అయ్యే వ్యయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 20 వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, పిసిసి సభ్యులు నల్లగొండ రమేష్, అడ్వకేట్ తీగల జీవన్, ఐ ఎన్ టి యూ సి నాయకులు బైరబోయిన చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు మురళి , నలిగంటి రాజు, బొబ్బిలి, గద్దల సంజీవ, బుర్ర విజయ్, బండి చందర్ పాల్గొన్నారు.

## తరుగు తీయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**కొత్తూరు గ్రామంలో భాజపా ధర్నా**



**లక్షెట్టిపేట / మంచిర్యాల, మహా :** తరుగు తీయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. బుధవారం కొత్తూరు గ్రామం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యకర్తలు, రైతులతో ఆయన బైఠాయించి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన అన్ని రకాల పంటకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని అన్నారు. అనంతరం పోలీసులు, రెవన్యూ అధికారులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో ఫోన్ లో మాట్లాడించి మాట్లాడించారు. కలెక్టర్ ఇచ్చిన హామీతో ఆందోళన కారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం, ఈదురు గాలుల ద్వారా గోడ కూలి మృతి చెందిన నలుగురు రైతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పారు. మృతి చెందిన రైతుల కుటుంబాలకు 50 లక్షలు రూపాయలతోపాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్




**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా పరిధిలోని ఏనుమాముల ఈవీఎం గోదాంను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్ని ప్రమాద నివారణ చర్యలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఉన్నాయా లేదా అని కలెక్టర్ సమీక్షించారు.అలాగే, గోదాంలో విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి భద్రతా చర్యల అమలుపై సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత ముఖ్యమని, ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు.ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్య రాణి , వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ డి టి రంజిత్,సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ లోని సౌకర్యాలు రైతులు వినియోగించుకోవాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**మహా వరంగల్ బ్యూరో;** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ఏనుమాముల మార్కెట్ యార్డులో రైతు వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం రైతు వారోత్సవాలలో భాగంగా వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని రైతులకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన పంటలు ముఖ్యంగా కాటన్ మేజ్, చిల్లి, ప్యాడి ఈ నాలుగు పంటలు తెలంగాణలో విరివిగా పడుతుందని, అట్టి పంటలను మనము మార్కెటింగ్ ద్వారా ఎక్స్పోర్ట్ చేసే అవకాశాలు చాలా ఉన్నాయని ముఖ్యంగా కాటన్ చూసినట్లయితే కాటన్ కి విదేశాల్లో విపరీతమైన ధర పలుకుతుందని, ఈ పంటను నాణ్యతగా మనం ప్యాక్ చేసేందుకు అన్ని బ్యాగులు కాకుండా ప్రత్యేక ప్యాకింగ్ లో చేసినట్లయితే మరింతగా నాణ్యత పెరుగుతుందని ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు మార్కెటింగ్, నిల్వ, ధరల సమాచారం, రవాణా సదుపాయాలు వంటి అంశాలపై అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో రైతులు తమ పంటలకు సరైన ధరలు పొందేందుకు మార్కెట్ యార్డ్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రైతులు మరింత లాభాలు పొందవచ్చని తెలియజేశారు.మార్కెట్ లో ఉన్న గిడ్డంగులు, తూకం సదుపాయాలు, బ్యాంకింగ్ సేవలు, ఎఫ్‌పీవోలు, రవాణా సదుపాయాలు వంటి అంశాలపై అధికారులు వివరించారు.రైతులు తమ పంటలను నేరుగా మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి మార్కెటింగ్ శాఖ అదరపు సంచాలకులు ఆర్ లక్ష్మణుడు హైదరాబాదు నుంచి హాజరు కాగా,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, అదనపు సంచాలకులు మార్కెటింగ్ హైదరాబాదు ఆర్ లక్ష్మణుడు, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సురేఖ, లీడర్ బ్యాంక్ అధికారులు రాజు ,ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం, గ్రేట్. 2 కార్యదర్శి ఎస్.రాము, అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ వరంగల్ గారు మాదూరి వేద ప్రకాష్, సంబంధిత అధికారులు మరియు వ్యాపారులు రైతులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి కాళోజీశాఖ గ్రంథాలయంలో కాంపిటేటివ్ పుస్తకాల అందజేత


**పుస్తకాలను అందించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీకమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్**

**బెల్లంపల్లి, మహా :** బెల్లంపల్లి కాళోజీశాఖ గ్రంథాలయంలో నిరుద్యోగ యువత ఉద్యోగాన్వేషణ కోసం కాంపిటేటివ్ పుస్తకాలు అవసరం కాగా తెలిసిన వెంటనే ఉదారతతో అందించారు.ఇటీవల ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా గ్రంథాలయాన్ని సందర్శించిన సందర్భంలో కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగ యువత గ్రంథాలయంలో కూడా అప్డేట్ వర్షన్ కాంపిటేటివ్ పుస్తకాలు కావాలని కోరిన సందర్భంగా వారి కోరిక మేరకు అవరమైనపుస్తకాలను తెప్పించి గ్రంథాలయానికి ఉచితంగా అందజేయడంతో హర్షం వ్యక్తం చేశారు.

## అయ్యా కమిషనర్ మా సమస్యలు తీర్చండి

**మందమర్రి మున్సిపాలిటీ నార్లాపూర్ వాసుల గోడు**

**మందమర్రి, మహా :** అయ్యా కమిషనర్ మా నార్లాపూర్ గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. తక్షణమే మా ఊరి సమస్యలు తీర్చాలని స్థానిక కమిషనర్ తుంగపండి రాయలింగు కు బుధవారంబీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి సత్యనారాయణ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నార్లాపూర్ ఆరవ వార్డులో గోదావరినీరు ఇంటింటికి నల్ల కనెక్షన్ బిల్లు అధికంగా వస్తున్న దృశ్య నెలవారి చెల్లింపులో మినహాయింపు ఇవ్వాలని అన్నారు. మున్నిమధ్య మా గ్రామానికి సిసి రోడ్డు మంజూరు అయిందని తెలిపారు. వీలైనంత త్వరగా ఆ పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. గోదావరి నీరు ప్రతిరోజు అన్ని వార్డులకు అందేలా చర్యలు చేపట్టాలని వివరించారు. గత కొంతకాలంగా గ్రామంలో బోర్ వెల్స్ (చేతి పంపులు) నుండి నీరు రావడం లేదని అన్నారు. వీలైనంత త్వరగా బోరు బావులకు మరమ్మత్తులు చేపించి వినియోగంలోకి తేవాలని అన్నారు. తమ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. వీలైనంత త్వరగా నాలీలను శుభ్రం చేపించి రానున్న వర్షాకాలంలో దోమల బారి నుండి రక్షించాలని పేర్కొన్నారు.కొత్తగా దరఖాస్తు చేసుకున్న వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన వెల్లడించారు.సొంత స్థానాలు ఉన్న వారికి ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయాలని కోరారు. అలాగే అందుగుల పేట మేడారం స్టేజి నుంచి నార్లపూర్ గేట్ వరకు అన్ని విద్యుత్తు స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆయన కమిషనర్, డి ఈ సుమతిలకు విన్నవించారు.బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు జాడ కొమరయ్య,అరకటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆ క్రేజీ సినిమాలో మృణాల్..
# ఈసారైనా నమ్మొచ్చా?


కొన్ని సినిమాలు అనుకున్న వెంటనే ప్రారంభం కావు. ఎందుకో ఎవరికీ అర్థం కాదు. తెలుగులో అలాంటి ఓ మూవీ ఉంది. నాని, నితిన్, శర్వానంద్ ఇలా పలువురు హీరోలు నటిస్తారని టాక్ వచ్చిన ఆ మూవీలో సాయిపల్లవి, కీర్తి సురేశ్ లాంటి హీరోయిన్లు లీడ్ రోల్ చేస్తారని రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు ఊహించని విధంగా మృణాల్ పేరు వినిపిస్తోంది. ఇంతకీ ఈ మూవీ సంగతేంటి? ప్రాజెక్ట్ ఎక్కడివరకు వచ్చింది? స్వతహాగా కమెడియన్ అయినప్పటికీ 'బలగం' మూవీతో దర్శకుడిగా మారిన వేణు బంపర్ హిట్ కొట్టాడు. దీని తర్వాత 'యల్లమ్మ' పేరుతో ఓ మూవీ చేయాలి. రెండు మూడేళ్ల నుంచి దీని గురించి వినిపిస్తూనే ఉంది. కానీ ఎంతకీ ముందుకు కదలట్లేదు. అసలు ప్రస్తుతం షూటింగ్ జరుగుతుందా లేదా అని చెప్పలేని పరిస్థితి. తొలుత ఈ సినిమాలో హీరోగా నాని చేస్తాడని రూమర్స్ వచ్చాయి. కానీ అతడు నో చెప్పడంతో నితిన్ లైన్‌లోకి వచ్చాడు. గతేడాది తన 'తమ్ముడు' మూవీ రిలీజ్ టైంలో జరిగిన ప్రమోషన్లలో నితిన్ దీని గురించి చెప్పాడు. కానీ 'తమ్ముడు' ఘోరమైన డిజాస్టర్ కావడంతో నితిన్‌ని సైడ్ చేశారు. తర్వాత శర్వానంద్ పేరు వినిపించింది. కట్ చేస్తే సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ హీరోగా ప్రకటించారు. ఓ వీడియోని కూడా రిలీజ్ చేసి షాకిచ్చారు.హీరో సెట్ అయ్యాడు గానీ హీరోయిన్ ఎవరనేది ఇప్పటికీ ప్రశ్నగానే మిగిలిపోయింది. తొలుత సాయిపల్లవి అన్నారు. ఆమె సెట్ అవ్వలేదు.



## ఆర్‌బీ చౌదరి భౌతిక కాయానికి
# విజయ్ నివాళులు


ప్రముఖ నిర్మాత అధినేత ఆర్‌బీ చౌదరి భౌతికకాయానికి హీరో, టీవీకే అధినేత విజయ్ నివాళులర్పించారు. చెన్నైలోని నిర్మాత నివాసానికి వెళ్లిన విజయ్ ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్నికల హడావుడిలో ఉన్నప్పటికీ విజయ్ స్వయంగా వెళ్లి నివాళులర్పించడం విశేషం. కాగా... ఆర్‌బీ చౌదరితో విజయ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. విజయ్ హీరోగా నటించిన పలు సూపర్ హిట్ చిత్రాలకు ఆర్‌బీ చౌదరి నిర్మాత వ్యహరించారు. ఆయన తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లోనూ సినిమాలు నిర్మించారు. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్‌బీ చౌదరి దుర్మరణం పాలయ్యారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఈ దుర్ఘటన జరిగింది. ఆయన మృతితో దక్షిణాది సినీ ప్రముఖులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మెగాస్టార్‌తో పాటు టాలీవుడ్ హీరోలంతా ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. చెన్నైలోని ఆయన నివాసానికి భౌతికకాయాన్ని తరలించగా కోలీవుడ్ స్టార్స్ నివాళులర్పించారు. కాగా.. గురువారం చెన్నైలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## ఎంకే స్టాలిన్‌తో రజనీకాంత్ భేటీ.. ఎందుకంటే..




**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఓటమి తర్వాత.. ఎం.కే స్టాలిన్‌ను రజనీకాంత్ ఆయన నివాసంలో ఇవాళ(బుధవారం) కలిశారు. మర్యాద పూర్వకంగానే రజనీకాంత్.. స్టాలిన్‌తో భేటీ అయ్యారని డీఎంకే వర్గాలు చెబుతున్నాయి. రజనీకాంత్.. స్టాలిన్ కలిసి కూర్చున్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నటుడు విజయ్ టీవీకే పార్టీ 108 స్థానాలను గెలుచుకోగా, డీఎంకే 59 స్థానాలకు పరిమితమైన సంగతి తెలిసిందే. స్టాలిన్ తన కొలత్తూరు నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి వి.ఎస్. బాబు చేతిలో సుమారు 8,700 ఓట్ల తేడాతో ఓడిపోయారు. డీఎంకే, మిత్రపక్షాలు రెండో అతిపెద్ద కూటమిగా నిలిచినందున.. కొత్త అసెంబ్లీలో అవి ప్రతిపక్ష స్థానంలో కూర్చోనున్నాయి. స్టాలిన్ ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆయన కుమారుడు, మాజీ డిప్యూటీ సీఎం, చెపాక్ ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. గతంలో రజనీకాంత్.. డీఎంకేకు అందించిన మద్దతు దృష్ట్యా ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. 1995లో రాజకీయాల్లోకి వస్తారని భావించిన సమయంలో ఆయన డీఎంకే కూటమికి మద్దతు ఇచ్చి ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. 1998 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఆయన పార్టీకి అండగా నిలిచారు. ఆ తర్వాత 2017లో రాజకీయ ప్రవేశాన్ని ప్రకటించినప్పటికీ, 2021లో అనారోగ్య కారణాలతో రజనీకాంత్ వెనక్కి తగ్గారు. విజయ్ విజయం తర్వాత.. ఆయనకు అభినందనలు తెలుపుతూ రజనీకాంత్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కాగా, విజయ్ తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ రెండు స్థానాల్లోనూ గెలిచారు. ఆయన పెరంబూర్ స్థానాన్ని ఉంచుకుని, తిరుచ్చి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేసే అవకాశం ఉంది. తద్వారా అక్కడ ఉప ఎన్నికలు జరగవచ్చు. మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆయనకు ఇంకా 10 స్థానాల మద్దతు అవసరం.

## ప్రభాస్ స్పిరిట్ వాయిదా..
# మేకర్స్ క్లారిటీ..!



యానిమల్ బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తోన్న యాక్షన్ మూవీ స్పిరిట్. ఈ చిత్రంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న మూవీపై అభిమానుల్లో భారీ అంచనలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అయితే కొద్ది రోజులుగా ఈ మూవీ వాయిదా పడనుందని వార్తలొచ్చాయి. షెడ్యూల్‌లో మార్పుల వల్ల పోస్ట్‌పోన్ కానుందని టాక్ వినిపించింది. ఈ నేపథ్యంలోనే స్పిరిట్ మేకర్స్ స్పందించారు. ఈ చిత్రాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని వెల్లడించారు. ముందుగా చెప్పినట్లుగానే వచ్చే ఏడాది మార్చి 5న విడుదలవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో ప్రభాస్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. టీసిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై పాన్ వరల్డ్ రేంజ్‌లో తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని ఎనిమిది భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఇందులో వివేక్ ఒబెరాయ్, ఐశ్వర్య దేశాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## చేసిన తెలుగు సినిమాలన్నీ ఫ్లాప్..
# అయినా తగ్గని క్రేజ్

సాధారణంగా సినిమాలు హిట్ అయితే హీరోయిన్లకు క్రేజ్ వస్తుంది. కొన్నిసార్లు ఫలితంతో సంబంధం లేకుండా ఫ్లాప్స్ అందుకున్నా సరే కొందరు బ్యూటీస్ బాగానే గుర్తింపు తెచ్చుకుంటారు. అలాంటి వాళ్ల ఈమె ఒకరు. మరో రెండు నెలల్లో ఈ భామ హీరోయిన్‌గా చేసిన మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. మరి ఈమె ఎవరో గుర్తుపట్టారా? చెప్పేయమంటారా? పైన మీసకట్టుతో తలపై కిరీటంతో కనిపిస్తున్న ఈ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే. ముంబైకి చెందిన ఈమె.. రవితేజ 'మిస్టర్ బచ్చన్'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. తొలి మూవీనే ఘోరమైన డిజాస్టర్. అయినా సరే 'కింగ్డమ్', 'కాంత' లాంటి పాన్ ఇండియా మూవీస్‌లో అవకాశాలు అందుకుంది. కానీ ఇవి కూడా బాక్సాఫీస్ దగ్గర ఫెయిలయ్యాయి. గతేడాది చివరలో వచ్చిన 'ఆంధ్ర కింగ్ తాలుకా' కూడా ఫ్లాప్ అయింది. ప్రస్తుతం భాగ్యశ్రీ చేస్తున్న తెలుగు సినిమా 'లెనిన్' మాత్రమే. అక్కినేని అఖిల్ హీరోగా నటించిన ఈ చితం.. జూన్ 26న థియేటర్లలోక రానుంది. ఇది హిట్ కావడం అఖిల్‌కి ఎంత ముఖ్యమో భాగ్యశ్రీకి కూడా అంతే కీలకం. ఎందుకంటే ఇది సక్సెస్ అయితే తెలుగులో మరికొన్ని అవకాశాలు వస్తాయి. లేదంటే పరిస్థితి కష్టమైపోవచ్చు. ఇకపోతే శివకార్తికేయన్ హీరోగా నటిస్తున్న 'సెయాన్' మూవీతో భాగ్యశ్రీ, తమిళంలోకి కూడా ఎంట్రీ ఇస్తోంది. ఈమె పుట్టినరోజు సందర్భంగా తాజాగా పోస్టర్ రిలీజ్ చేసి ఈ విషయాన్ని ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com